



భద్రిరాజుపాలెంలో రోడ్డుపై ధాన్యాన్ని రెండోసారి ఆరబోస్తున్న రైతు

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు

- ఆర్ఎస్‌కే ఇచ్చిన తేమ శాతమే ఫైనల్ అన్న కలెక్టర్
- యాకమూరు రైస్‌మిల్లులో మళ్లీ తేమ శాతం పరీక్ష
- భద్రిరాజుపాలెం రైతు ధాన్యం వెనక్కి పంపిన మిల్లర్
- రైతుకు కాటా, రవాణా ఖర్చులు రూ.5 వేలు వృథా

తోట్లవల్లూరు-ఆంధ్రజ్యోతి: జిల్లా కలెక్టర్ ఆదేశాలను కొందరు రైస్ మిల్లర్లు బేఖాతరు చేస్తున్నారు. ఆర్ఎస్‌కేల నుంచి వచ్చిన ధాన్యాన్ని మిల్లు వద్ద తేమ పరీక్ష చేయవద్దని, ఆర్ఎస్‌కె ఇచ్చిన తేమ శాతం రిపోర్టే ఫైనల్ అని కలెక్టర్ చేసిన హెచ్చరికను పాటించడంలేదు. ఈ నెల 5వ తేదీన వల్లూరుపాలెం వచ్చిన కలెక్టర్ డీకే బాలాజీ పైఆదేశాలను ఇవ్వగా 9వ తేదీన యాకమూరుకు చెందిన ఓ రైస్ మిల్లు యజమాని ఉల్లంఘించారు. వివరాల్లోకి వెళితే.. భద్రిరాజు పాలేనికి చెందిన కౌలురైతు వీరంకి సీతారామయ్య ఆర్ఎస్‌కే ఇచ్చిన 17 తేమ శాతం రిపోర్టుతో 9వ తేదీన 40 కిలోల చొప్పున 150 టిక్కీల ధాన్యాన్ని యాకమూరు రైస్‌మిల్లుకు పంపారు. ఆ మిల్లర్ మళ్లీ తేమ శాతాన్ని పరీక్షించి 27 శాతం ఉందని ధాన్యాన్ని వెనక్కి పంపించారు. రైతు సీతారామయ్య బతిమిలాడితే రూ.1,07,000 డబ్బు కడితే ధాన్యాన్ని దించుతామని, లేకుంటే వెనక్కి తీసుకెళ్లి రెండు రోజులు ఆరబెట్టి తీసుకురమ్మని మిల్లర్ చెప్పేశాడు. దాంతో అంత డబ్బు చెల్లించలేక ధాన్యాన్ని వెనక్కి తెచ్చి చెరువు వద్ద రహదారిపై ఆరబెట్టామని రైతు సీతారామయ్య తన ఆవేదనను వెళ్లబుచ్చాడు. 150 టిక్కీల ధాన్యాన్ని మిల్లుకు తీసుకెళ్లి వచ్చేసరికి రూ.4,800 ఖర్చయిందని, కౌలురైతుగా ఇలాంటి నష్టాన్ని భరించటం సాధ్యం కాదని వాపోయాడు. మళ్లీ కూలీలతో ఆరబెట్టి మిల్లుకు తీసుకెళ్లాలంటే మరో రూ.5 వేలు ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. దీనికి ఎవరు బాధ్యత వహిస్తారని, ఆర్ఎస్‌కే తీసిన తేమ శాతాన్ని మిల్లర్ పరిగణలోకి తీసుకుని ఉంటే ఇన్ని కష్టనష్టాలు ఎదురయ్యేవి కాదన్నారు. కాగా, రైస్‌మిల్లర్లు తేమ శాతం పేరుతో ధాన్యంలో కోత విధించినందుకు వీఏఏ, వీఆర్వోలను అధికారులు సస్పెండ్ చేస్తున్నారు. కాని మిల్లర్లు సేఫ్‌గానే ఉంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. నిబంధనలు ఉల్లంఘించిన మిల్లర్‌పై కూడా చర్యలు తీసుకుంటే రైతులకు ఇలాంటి ఇబ్బందులు ఎదురుకావని అంటున్నారు. మిల్లర్ల తీరుతో నష్టపోయిన వెలుగులోకి రాని రైతులు చాలామంది ఉన్నట్లు సమాచారం.

స్వర్ణాంధ్ర-2047కి సర్వ సన్నద్ధం 6లో



బెజవాడలో నేడు ట్రాఫిక్ ఆంక్షలు 8లో



నేటినుంచి సాలికట్ల బ్రహ్మోత్సవాలు 6లో

ఒకప్పుడు ఒక వెలుగు వెలిగిన మచిలీపట్నం పట్టణాభివృద్ధి సంస్థ (ముడా) నేడు ఆర్థిక సమస్యలలో అల్లాడిపోతోంది. సొంత భవనం లేక అద్దె భవనంలో అరకొర వసతులతో నెట్టుకొస్తోంది. కమర్షియల్ లే అవుట్ల ద్వారా ఆశించిన స్థాయిలో ఆదాయం లభించకపోవడంతో నవంబరు నెల అధికారులు, సిబ్బందికి జీతాలు కూడా చెల్లించలేని దుస్థితికి చేరింది. గత వైసీపీ పాలనలో ముడా ఆదాయ వనరులు పెంచడంలో విఫలమవ్వడమే దీనికి ప్రధాన కారణమని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన మట్టా ప్రసాద్ ఈ ఆర్థిక సమస్యల నుంచి ముడాను ఎలా గట్టెక్కిస్తారో వేచిచూడాలి.



ముడా కార్యాలయం

కష్టాల కడలిలో ముడా

మచిలీపట్నం పట్టణాభివృద్ధి సంస్థలో నిధుల లేమి

- ఆశించిన స్థాయిలో రాని ఆదాయం
- సిబ్బంది జీతాలకు వెతుక్కోవాల్సిందే..
- స్టేషనరీ కూడా కొనలేని దుస్థితి
- నాటి వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతోనే నేటి ఈ అవస్థలు

మచిలీపట్నం టౌన్- ఆంధ్రజ్యోతి: 2015లో మడ పేరుతో ఏర్పడిన మచిలీపట్నం పట్టణాభివృద్ధి సంస్థ పేరును 2016లో ముడాగా మార్చారు. గతంలో వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఉండే ముడా కార్యాలయం ప్రస్తుతం వరలక్ష్మి పాలిటెక్నిక్ కళాశాల అద్దె భవనంలో నడుస్తోంది. నెలకు రూ. 36వేల అద్దె చెల్లిస్తున్నారు. 2018లో మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్ ముడా చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. బందరు పోర్టుకు, పోర్టు ఆధారిత పరిశ్రమలకు కావలసిన భూములను రెండు విధాలుగా రైతుల నుంచి తీసుకున్నారు. ల్యాండ్ పర్చేజ్ పథకం కింద 590 ఎకరాలు, ల్యాండ్ పూలింగ్ కింద 296 ఎకరాలు తీసుకున్నారు. ఇలా అమరావతి రాజధానికి తీసుకున్న విధంగా ముడా ద్వారా పోర్టుకు కావలసిన భూములు తీసుకున్నారు. అప్పట్లో ఈ భూముల సేకరణ ప్రక్రియ ఒక విజన్‌లాగా సాగింది. ఎనిమిది మంది డిప్యూటీ కలెక్టర్లు, ఎనిమిది మంది సర్వేయర్లు, నలుగురు డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ఎనిమిది మంది డిప్యూటీ తహసీల్దార్లు, ఐదుగురు ప్లానింగ్ ఆఫీసర్లు, 20 మంది కంప్యూటర్ ఆపరేటర్లు, ఐదుగురు అటెండర్లు ఉండేవారు. ప్రతి డిప్యూటీ కలెక్టర్‌కు ఒక వాహనం ఉండేది. నిరంతరం కళకళలాడుతుండే ముడా కార్యాలయం భూముల సేకరణ అనంతరం వెలవెలపోయింది. ఉద్యోగస్తులను తొలగించారు. ఆ తర్వాత వైసీపీ పాలనలో ముడా ఆదాయపు వనరులు పెంచడంపై ఆశించిన విధంగా దృష్టి సారించలేదు. ప్రస్తుత ఇద్దరు డిప్యూటీ కలెక్టర్లు, ఒక ప్లానింగ్ ఆఫీసర్, ఒక జూనియర్ ప్లానింగ్ ఆఫీసర్, నలుగురు కంప్యూటర్ ఆపరేటర్లు, ఇద్దరు అటెండర్లు మాత్రమే ఉన్నారు. ఒక డిప్యూటీ కలెక్టర్ అవనిగడ్డకు బదిలీ కానున్నారు. ఈ నేపథ్యంలో ముడా కార్యకలాపాలపై ప్రత్యేక దృష్టి సారించవలసి ఉంది.

స్టేషనరీకి నిధుల్లేవు

13 మండలాల పరిధిలో ఉన్న ముడాకు గతంలో ఏడాదికి రూ.3 కోట్ల ఆదాయం వచ్చేది. ఇప్పుడా ఆదాయం పడిపోయింది. మచిలీపట్నం నగర పాలక సంస్థ పరిధిలో 500 చదరపు గజాలపైన ఉండే నిర్మాణాలు, అపార్ట్‌మెంట్లకు ముడా నుంచి అనుమతులు తీసుకోవాలి. అంతకంటే తక్కువ చదరపు గజాలు ఉండే నిర్మాణాలకు మునిసిపాలిటీనే అనుమతులిస్తోంది. కాగా, గ్రామాల్లో 300 చదరపు గజాలు, ఆపైన ఉండే నిర్మాణాలకు ముడా అనుమతులు తీసుకోవాలి. 300 చదరపు గజాల నిర్మాణాలకు గ్రామ పంచాయతీనే అనుమతులిస్తోంది. ఈ నేపథ్యంలో మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీల నుంచి ఎక్కువ చదరపు అడుగుల నిర్మాణాలకు ముడా నుంచి అనుమతులు తీసుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి.

ముడా భూముల్లో యథేచ్ఛగా తవ్వకాలు..

ముడా భూముల్లోని కోట్లాది రూపాయల విలువైన మట్టిని వైసీపీ పాలన నుంచి తవ్వుకుపోతూనే ఉన్నారు. ఓడలు నిలిపే స్థలం నుంచి రైల్వేలైన్లు, రోడ్లు, పరిశ్రమలకు, గిడ్డంగులకు వెళ్లే రహదారులు, పాడి పరిశ్రమలకు కావలసిన స్థలాల్లో ముడా సేకరించిన భూముల నుంచి అలాట్ చేయవలసి ఉంది. అయితే ముడా భూములు కొన్నింటిని తవ్వివేయడం వల్ల ఆ భూముల్లో పరిశ్రమలు స్థాపించుకునే యజమానులు ఆ భూములను మెరక చేయవలసిన పరిస్థితి ఏర్పడింది.

బీపీసీఎల్ ప్రాజెక్టు వెనక్కి?

ముడా భూములను పరిశీలించిన బీపీసీఎల్ అధికారుల మచిలీపట్నంలో బీపీసీఎల్ ఏర్పాటు చేసేందుకు గోతులమయమైన భూములు అనుకూలంగా లేవని నివేదికలు ఇచ్చినట్టు తెలుస్తోంది. మచిలీపట్నం పార్లమెంటు సభ్యుడు వల్లభనేని బాలశౌరి బీపీసీఎల్‌ను మచిలీపట్నం తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేశారు. అయితే బీపీసీఎల్ టీమ్ సర్వేలో భూములు అనుకూలంగా లేవని నివేదికలు సమర్పించడంపై అధికారులు, ప్రజాప్రతినిధులు పునరాలోచన చేయాల్సి ఉంది. వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించే బీపీసీఎల్ ప్రాజెక్టు నెలకొల్పేందుకు మరింత శ్రద్ధ తీసుకోవలసి అవసరం ఉంది. అదే విధంగా కంటైనర్ కార్పొరేషన్‌కు కావలసిన భూములపై ప్రజాప్రతినిధులు దృష్టి సారించాల్సి ఉంది. ఇలా మచిలీపట్నం అభివృద్ధితో పాటు కృష్ణాజిల్లా అభివృద్ధికి ముడి పడి ఉన్న ముడా పాలనా వ్యవహారాలతో పాటు ఆర్థిక వనరులు పెంపొందించేందుకు ప్రత్యేక శ్రద్ధ వహించవలసి ఉంది.

కొత్త చైర్మన్ ఎదుట అనేక సవాళ్లు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మైనస్ బడ్జెట్‌లో ఉన్న ముడాకు బీజేపీ నాయకుడు మట్టా ప్రసాద్ చైర్మన్‌గా ఇటీవల బాధ్యతలు స్వీకరించారు. డిప్యూటీ కలెక్టర్లు క్షేత్ర పర్యటనలకు వెళ్లే వాహనాలకు కనీసం పెట్రోలు కూడా కొట్టించే పరిస్థితి లేకుండా పోయింది. ఆఫీసులో స్టేషనరీ కూడా కొనలేని పరిస్థితి ఏర్పడింది. ఉద్యోగులు, అధికారులకు జీతాలు చెల్లించలేని దుస్థితిలో ఉన్న ముడాపై ఇప్పుడు చైర్మన్ గౌరవ వేతనం, ఇంటి అద్దె అలవెన్సులు, వెహికల్ అలవెన్సులు కలిపి నెలకు రూ. లక్షా 75 వేల వరకు చెల్లించాల్సిన బాధ్యత ఉంది. గతంలో వ్యవసాయ శాఖ కార్యాలయంలో ఉండే ముడా కార్యాలయం ప్రస్తుతం వరలక్ష్మి పాలిటెక్నిక్ కళాశాల అద్దె భవనంలో నడుస్తోంది. నెలకు రూ. 36వేల అద్దె చెల్లించాల్సి వస్తోంది. ఈ అద్దె భవనంలో ముడా చైర్మన్‌కు ప్రత్యేక వాష్‌రూమ్ కూడా లేకపోవడం గమనార్హం. ఎన్నో ఆశలతో సేవ చేసేందుకు వచ్చిన ముడా చైర్మన్ మట్టా ప్రసాద్ ముందు అనేక సవాళ్లు ఉన్నాయి.

ఆదాయ వనరులు పెంచుతాం



ముడా ఆదాయం తగ్గిన మాట వాస్తవమే. ఆదాయ వనరులు పెంపొందించేందుకు కృషి చేస్తాం. ముడాను జిల్లాలో ఒక మోడల్ అభివృద్ధి సంస్థగా రూపొందిస్తాం. ఇందుకు జిల్లాలోని అధికారులు, ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలు తీసుకుంటాం.

- మట్టా ప్రసాద్, ముడా చైర్మన్

విద్యుత్ టవర్ల మార్పిడిపై ఆందోళన

జక్కంపూడి, నున్నలో ప్లాట్ల యజమానులు, రైతుల నిరసన

మద్దతు పలికిన వైసీపీ, బీజేపీ నేతలు



రైతులతో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్

విజయవాడ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మూతపడిన ల్యాంకో పవర్ ప్లాంట్ హైటెన్షన్ ట్రాన్స్‌మిషన్ టవర్ల మార్పిడి పేరుతో రైతులు, ప్రజల ఆస్తులను ఛిన్నాభిన్నం చేస్తున్నారని రాజకీయ పక్షాలు ఆందోళనకు దిగాయి. జక్కంపూడి ప్రాంతంలో భూములు కలిగిన రైతులు, ప్లాట్ల యజమానులతో కలిసి వైసీపీ, బీజేపీ నేతలు గురువారం నిరసన చేపట్టాయి. మూతపడిన ల్యాంకో కంపెనీ ప్రయోజనాల కోసం కాంట్రాక్టు సంస్థ మేఘా, జాతీయ రహదారుల సంస్థ ఆరాటపడటం వెనుక పెద్ద కుంభకోణమే కనిపిస్తోందని ఆరోపించాయి. రైతులకు అన్ని విధాలా అండగా ఉంటామని, ఈ వ్యవహారాన్ని తేల్చే వరకు వారి వెంటే ఉంటామని చెప్పారు. అంతకుముందు రైతుల భూముల్లో మేఘా కంపెనీ తవ్వకాలు జరుపుతున్న ప్రాంతాలను రాజకీయ నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా వైసీపీ నేత పోతిన మహేశ్ మాట్లాడుతూ రైతులకు సమాచారం ఇవ్వకుండా, వారి అభిప్రాయాలను తెలుసుకోకుండా ఏ విధంగా వారి భూముల్లో తవ్వకాలు జరుపుతారని ప్రశ్నించారు. తక్షణం ఎన్‌హెచ్ అధికారులు, రైతులు, రెవెన్యూ, మేఘా కంపెనీ యాజమాన్యంతో కలెక్టర్ కమిటీని వేసి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్ మాట్లాడుతూ రైతుల అనుమతి లేకుండా, ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా తవ్వకాలు జరపడం అన్యాయమన్నారు. అలాగే, హైటెన్షన్ విద్యుత్ వైర్ల కోసం జక్కంపూడితో పాటు నున్న పంచాయితీ పరిధిలోనూ మేఘా సంస్థ తవ్వకాలు జరపడంపై అప్రూవ్‌డ్ వెంచర్‌లోని ప్లాట్ల యజమానులు ఆందోళన వ్యక్తం చేశారు. గురువారం రైతులతో పాటు ఆందోళన చేశారు.

అమరావతిలో 'ఫైవ్' స్టార్ హోటల్స్

- ముందుకు వచ్చిన ఆ సంస్థలు
- మచిలీపట్నంలో ఏర్పాటుకు వాంటేజ్ గ్రూప్ ఆసక్తి

(ఆంధ్రజ్యోతి-విజయవాడ): అమరావతి రాజధానిలో స్టార్ హోటల్స్ ఏర్పాటుకు రంగం సిద్ధమైంది. అతి త్వరలో ఐదు స్టార్ హోటల్స్ అందుబాటులోకి రానున్నాయి. వీటిపై ఆయా సంస్థల యాజమాన్యాల నుంచి ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయి. నూతన పర్యాటక పాలసీ తీసుకువస్తున్న నేపథ్యంలో, హోటల్స్ రంగం ఎంతో ఆసక్తిగా ఉంది. ప్రస్తుతం భూ ప్రతిపాదనల దశలో ఉన్నాయి. అమరావతిలో ముందుకు వచ్చిన సంస్థలను చూస్తే ఐఆర్‌సీటీసీ, అట్మాస్ఫియర్ కేర్, ఒబెరాయ్ గ్రూప్, తాజ్ గ్రూప్‌కు చెందిన ఐహెచ్‌సీఎల్, రహేజా గ్రూపులు ఉన్నాయి. ఐర్‌సీటీసీ 3 ఎకరాలు, అట్మాస్ఫియర్ కేర్ కు 10 ఎకరాలు, ఐహెచ్‌సీఎల్‌కు 10 ఎకరాలు, ఒబెరాయ్ గ్రూప్‌కు 10 ఎకరాలు, రహేజా గ్రూప్‌కు 5 ఎకరాల చొప్పున కావాల్సి ఉంది. రహేజా గ్రూప్ విజయవాడలో కూడా కృష్ణానది ఒడ్డున స్టార్ హోటల్ ఏర్పాటుకు ఆసక్తి చూపిస్తోంది. దీనికి ఐదెకరాలు కావాల్సి ఉంది. వాంటేజ్ గ్రూప్ మచిలీపట్నంలోని మంగినపడి బీచ్ దగ్గర స్టార్ హోటల్ ఏర్పాటుకు ఆసక్తి చూపిస్తోంది. దీనికి 10 ఎకరాలు కావాల్సి ఉంది. ఆయా సంస్థలతో తుది అగ్రిమెంట్లు చేసుకునే క్రమంలో భూములను స్వాధీనం చేసే అవకాశం ఉంది.

గౌతంరెడ్డి ఎక్కడ?

- బెయిల్ రాకపోవడంతో మరోసారి అజ్ఞాతంలోకి..
- ఇప్పటికే ఒకసారి జంప్ అయిన వైసీపీ నేత
- బెయిల్ పిటిషన్ పేరుతో బయటకు
- తాజాగా కోర్టు పిటిషన్ రద్దు చేయడంతో షాక్
- తీర్పు రాకముందే పోలీసుల కళ్లుగప్పి పలాయనం
- ముమ్మరంగా పోలీసుల వేట
- రంగంలోకి నాలుగు ప్రత్యేక బృందాలు



హత్యాయత్నం కేసులో వైసీపీ నేత పూనూరు గౌతంరెడ్డి మరోమారు అజ్ఞాతంలోకి వెళ్లాడు. ఇప్పటికే ఒకసారి పోలీసులను తప్పించుకు తిరిగిన ఆయన బెయిల్ పిటిషన్ పేరుతో బయటకు వచ్చాడు. తాజాగా కోర్టు ఆయన బెయిల్ పిటిషన్‌ను రద్దు చేయడంతో మరోమారు పోలీసుల కళ్లుగప్పి పారిపోయిన గౌతంరెడ్డి కోసం వేట మొదలైంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : సత్యనారాయణపురంలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ గండూరి ఉమామహేశ్వరశాస్త్రిపై సుపారీ గ్యాంగ్‌తో హత్యాయత్నం చేయించిన వైసీపీ నేత పూనూరు గౌతంరెడ్డి మళ్లీ అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడు. ఈ కేసులో బెయిల్ కోసం తీవ్రంగా ప్రయత్నించిన ఆయన ఆశలకు న్యాయస్థానం బ్రేక్ వేసింది. తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని గౌతంరెడ్డి హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్‌ను కోర్టు రెండు రోజుల క్రితం డిస్మిస్ చేసింది. దీంతో పోలీసులు అరెస్టు చేస్తారని భావించిన గౌతంరెడ్డి రాత్రికి రాత్రి నగరం నుంచి పారిపోయాడు. గతనెల 6వ తేదీన ఉమామహేశ్వరశాస్త్రిపై సుపారీ గ్యాంగ్ హత్యాయత్నం చేసింది. ఈ కేసులో ఇప్పటి వరకు ఏడుగురు నిందితులను అరెస్టు చేశారు. తొమ్మిది మంది నిందితుల్లో మరో ఇద్దరు పోలీసులకు చిక్కాల్సి ఉంది. వారిలో గౌతంరెడ్డి ఒకరు కాగా, ఆయన అనుచరుడు పురుషోత్తం రెండో నిందితుడు. ఇందులో సనత్‌నగర్‌కు చెందిన పురుషోత్తం లా చదువుతున్నాడు. అతడికి పరీక్షలు ఉండటంతో హైకోర్టు మినహాయింపు ఇచ్చింది. ప్రస్తుతం ఎల్‌ఎల్‌ఎం పరీక్షలు రాస్తున్నాడు. దీంతో హైకోర్టు ఈనెల 16 వరకు అరెస్టు నుంచి మినహాయింపు ఇచ్చింది. పురుషోత్తం నగరంలోనే ఉన్నాడు. గౌతంరెడ్డి మాత్రం కోర్టులో బెయిల్ పిటిషన్ డిస్మిస్ కాగానే, ఇంటి నుంచి పరారయ్యాడు. పిటిషన్ కోర్టు విచారణలో ఉండగా, సత్యనారాయణపురం పోలీసుల ముందు హాజరయ్యాడు. పోలీసులు పలు విధాలుగా ప్రశ్నించినా మౌనవ్రతం చేసి తప్పించుకున్నాడు. హైకోర్టు తనకు కచ్చితంగా ముందస్తు బెయిల్ మంజూరు చేస్తుందన్న ధీమాతో పోలీసు విచారణకు హాజరయ్యాడు. తర్వాత సీన్ రివర్స్ కావడంతో నగరం విడిచి పారిపోయాడు. ఘటన జరిగాక పోలీసులు కేసు నమోదు చేయగానే, హైదరాబాద్‌కు పారిపోయాడు. ఇప్పుడూ అక్కడికే వెళ్లిపోయి ఉంటాడని పోలీసులు అనుమానిస్తున్నారు.

తీర్పు రాకముందే జంప్

గౌతంరెడ్డి విషయాన్ని పోలీసులు సీరియస్‌గా తీసుకున్నారు. పోలీసులపై ఆరోపణలు చేస్తూ అతడు బెయిల్ పిటిషన్ దాఖలు చేశాడు. మరోపక్క పోలీసులపైకి న్యాయవాదులను ఉసిగొల్పే ప్రయత్నాలు చేశాడు. గౌతంరెడ్డి పాత నేరచరిత్రను పైకి తీసిన పోలీసులు అతడికి సంకెళ్ల వేయడానికి సిద్ధమయ్యారు. ఇప్పటి వరకు హైకోర్టు ఆదేశాలతో ముందుకు అడుగులు వేయకుండా ఉన్న పోలీసులు బుధవారం నుంచి దూకుడు పెంచారు. రైల్వేస్టేషన్, బస్‌స్టేషన్లలో తీవ్రంగా నిఘా పెట్టారు. మరోపక్క సత్యనారాయణపురంలోని ఇంటి చుట్టూ వేగులను ఏర్పాటు చేశారు. అయినా గౌతంరెడ్డి తప్పించుకున్నాడు. తీర్పు రావడానికి ముందే అతడు ఇక్కడి నుంచి పారిపోయి ఉంటాడని అనుమానిస్తున్నారు.

నాలుగు బృందాల గాలింపు

గౌతంరెడ్డిని అరెస్టు చేయడానికి పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు నాలుగు ప్రత్యేక బృందాలను నియమించారు. ఇందులో రెండు టాస్క్‌ఫోర్స్ నుంచి, మరో రెండు లా అండ్ ఆర్డర్ నుంచి పనిచేస్తున్నాయి. ప్రస్తుతం గౌతంరెడ్డి సెల్‌ఫోన్ స్విచ్ఛాఫ్‌లో ఉంది. వేర్వేరు నెంబర్లతో అనుచరులు, న్యాయవాదులతో సంప్రదింపులు చేస్తున్నట్టు తెలిసింది. ఎక్కువగా వాట్సాప్ కాల్స్‌లో మాట్లాడుతున్నట్టు సమాచారం. హైదరాబాద్ నుంచి కడపకు కానీ, బెంగళూరుకు కానీ వెళ్లి ఉండొచ్చని పోలీసులు అనుమానిస్తున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గౌతంరెడ్డి చేతులకు సంకెళ్లు వేస్తామని పోలీసులు చెబుతున్నారు. టాస్క్‌ఫోర్స్, లా అండ్ ఆర్డర్ బృందాలు మామూలుగా గాలింపు చర్యలు చేపడుతుండగా, కొన్ని బృందాలు సాంకేతికంగా విశ్లేషణలు చేస్తున్నాయి. గౌతంరెడ్డి తన సామాజికవర్గం అధికంగా ఉండే జిల్లాల్లో తలదాచుకునే అవకాశాలు ఉన్నాయన్న అనుమానం వ్యక్తమవుతోంది.

తోట్లవల్లూరు మండలంలో అధికారిక ఇసుక క్వారీల ప్రారంభంలో సందిగ్ధం నెలకొంది. నదీ పాయల్లో వరద నీరు తగ్గగానే ఇసుక తవ్వకాలు చేపట్టేందుకు సిద్ధమైన కాంట్రాక్టర్లు ఆయా క్వారీల్లో లక్షల రూపాయలు ఖర్చు పెట్టి లక్షూటలు కూడా నిర్మించారు. అయితే స్టాక్ యార్డుల స్థలం విషయమై ఏర్పడి వివాదం నేపథ్యంలో క్వారీలు ప్రారంభానికి నోచుకోలేదు. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమ వుతున్నాయి.

ఇసుక క్వారీల ప్రారంభంపై సందిగ్ధం!



నార్త్‌వల్లూరు క్వారీకి నిర్మించిన బాట

- ఐదు క్వారీలకు బాటలు నిర్మించి వదిలేసిన కాంట్రాక్టర్లు
- స్టాక్ యార్డుల స్థలంపైనే వివాదం!
- గత ప్రభుత్వ పాలసీ ప్రకారం ఫిబ్రవరి 6తో గడువు పూర్తి
- అధికారుల తీరుపైనా విమర్శలు

తోట్లవల్లూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): తోట్లవల్లూరు మండలంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఐదు ఇసుక క్వారీల ప్రారంభం సందిగ్ధంలో పడింది. 20 రోజుల క్రితమే క్వారీలకు కాంట్రాక్టర్లు రహదారులను నిర్మించి అలాగే వదిలి వేశారు. తోట్లవల్లూరు పాయలో వేలాది రూపాయలు ఖర్చుపెట్టి నిర్మించిన రహదారికి గండిపెట్టి నిరుపయోగంగా మార్చారు. రొయ్యూరు క్వారీ కూడా ఇలాగే ఉంది. మండలంలో నార్తువల్లూరు పరిధిలో మూడు, రొయ్యూరు పరిధిలో రెండు క్వారీలకు టెండర్లు ఎప్పుడో పూర్తయ్యాయి. నదీ పాయల్లో వరద నీరు తగ్గగానే ఇసుక తవ్వకాలు ప్రారంభిస్తారని అందరూ అనుకున్నారు. అందుకు తగ్గట్టుగానే లక్షల రూపాయలు ఖర్చు చేసి గ్రావెల్‌తో రోడ్లు నిర్మించారు. నార్తువల్లూరు క్వారీలను శ్రీధర్ గోపాలకృష్ణ, రొయ్యూరు క్వారీలను పూర్ణచంద్రరావు, భవానీ శంకర్ దక్కించుకున్నట్టు తహసీల్దార్ ఎం.కుసుమకుమారి తెలిపారు. ఈ కాంట్రాక్టర్లు క్వారీలను ప్రారంభించేందుకు తోట్లవల్లూరు, రొయ్యూరులో బాటలు నిర్మించిన తరువాత క్వారీలను ప్రారంభించకుండా ఎందుకు వెనక్కు తగ్గారో తెలియకుండా ఉంది. సదరు కాంట్రాక్టర్ల చేత క్వారీలను ప్రారంభింపచేయటంలో అధికారుల వైఫల్యం కూడా ఉన్నట్టు విమర్శలు వస్తున్నాయి.

స్టాక్ యార్డులే కారణమా?

ప్రభుత్వం మంజూరు చేసిన ఐదు ఇసుక క్వారీలు ప్రారంభం కాకపోవటానికి స్టాక్‌యార్డుల వివాదమే కారణమని తెలిసింది. ట్రాక్టర్ ఇసుకను స్టాక్‌యార్డుకి తరలించేందుకు అతి తక్కువ ధరకు రూ 99కి దక్కించుకున్న కాంట్రాక్టర్లలో ఇప్పుడు నష్టాల భయం పట్టుకున్నట్టు సమాచారం. నార్తువల్లూరు క్వారీల నుంచి వల్లూరుపాలెం వద్ద గతంలో ఉన్న స్టాక్‌యార్డుకు ఇసుకను తీసుకు రావాలని అధికారులు చెప్పటంతో కాంట్రాక్టర్లు వెనక్కి తగ్గటానికి ప్రధాన కారణంగా చెబుతున్నారు. సుమారు తొమ్మిది కిలో మీటర్ల దూరంలో ఉన్న వల్లూరుపాలెం స్టాక్‌యార్డుకి ఇసుకను తేలేమని, తోట్లవల్లూరు వద్ద బీసీ సొసైటీ భూముల్లో స్టాక్‌యార్డుకి అనుమతిస్తే క్వారీలను ప్రారంభిస్తామనే కండీషన్ కాంట్రాక్టర్లు పెట్టినట్టు తెలిసింది. రొయ్యూరులో కూడా స్టాక్ యార్డు సమస్య ఉన్నట్టు తెలిసింది. తక్కువ దూరంలో స్టాక్‌యార్డులు పెడితే క్వారీలను ప్రారంభిస్తామని అధికారులకు కాంట్రాక్టర్లు తెలిపినట్టు, అందుకు అధికారులు అనుమతి నిరాకరిస్తున్నట్టు సమాచారం. దీంతో క్వారీలను ప్రారంభించలేదని అంటున్నారు. ఈ ఐదు క్వారీలు గత వైసీపీ ప్రభుత్వంలో మంజూరయినవేనని, వీటి గడువు ఫిబ్రవరి 6తో ముగుస్తుందని చెబుతున్నారు. దూరంలో ఉన్న స్టాక్ యార్డుల కారణంతో క్వారీలను వదులుకుంటారో లేక ప్రారంభిస్తారో చూడాలి.



విద్యుదీపాలంకరణలో డోకిపర్రు భూ సమేత వేంకటేశ్వరస్వామి ఆలయం

నేటినుంచి సాలికట్ల బ్రహ్మోత్సవాలు

గుడ్లవల్లేరు, డిసెంబరు, 12 (ఆంధ్రజ్యోతి) : నేటి నుంచి డోకిపర్రు శ్రీ భూ సమేత వేంకటేశ్వర స్వామి ఆలయ సాలికట్ల బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. 13వ తేదీ శుక్రవారం నుంచి 16వ తేదీ సోమవారం వరకు వేడుకలు నిర్వహించనున్నారు. తొలిరోజు శుక్రవారం అంకురార్పణ, తిరుచ్చి(పల్లకీ) సేవలు, శనివారం ధ్వజారోహణ, సూర్య ప్రభ వాహనం, శేషవాహనం, హంస వాహన సేవలు, ఆదివారం గజ వాహనోత్సవం, రథోత్సవం, గరుడోత్సవాలు, సోమవారం చూర్ణోత్సవం, వసంతోత్సవం, చక్రస్నానం, శ్రీ శ్రీనివాస కళ్యాణం, ధ్వజ అవరోహణ, చంద్రప్రభ వాహనోత్సవాలు నిర్వహించనున్నట్టు ఆలయ ధర్మకర్తలు పి.వి.కృష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు తెలిపారు.



నాట్య స్థూపానికి స్వాగతం పలుకుతున్న కళాకారులు

కూచిపూడి పతాక స్వర్ణోత్సవాలకు శ్రీకారం

కూచిపూడి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కూచిపూడి హెరిటేజ్ ఆర్ట్స్ సొసైటీ ఆధ్వర్యంలో ఈనెల 27 నుంచి 29 వరకు మూడు రోజులపాటు నిర్వహించే నాట్యోత్సవాలకు సంబంధించిన కార్యక్రమాలు చురుగ్గా ప్రారంభమయ్యాయి. దీనిలో భాగంగా కూచిపూడి సాంప్రదాయాలను ప్రతిబింబించే రీతిలో 50 అడుగుల నాట్య స్థూపాన్ని ప్రతిష్ఠించేందుకు నిర్వాహకులు సన్నాహాలు చేస్తున్నారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్య కళా పీఠం ప్రాంగణం సమీపంలో ఏర్పాటు చేసే ఈ స్థూపం కూచిపూడి గ్రామానికి చేరుకుంది. ఏక శిలపై రూపొందించిన ఈ స్థూపంలో నాట్యానికి సంబంధించిన హస్తముద్రికలతోపాటు శ్రీ సిద్ధేంద్ర యోగి, నటరాజ స్వామి, యక్షగాన ఆభరణాలు, సత్యభామ జడ చిత్రాలను చిత్రీకరించారు. కేంద్ర సంగీత నాటక అకాడమీ అవార్డు గ్రహీత పసుమర్తి రత్తయ్య శర్మ, ప్రముఖ నాట్యాచార్యులు వేదాంతం రాధేశ్యామ్, ఉత్సవ కమిటీ కన్వీనర్ వేదాంతం వెంకటాచలపతి, వేదాంతం రామలింగశాస్త్రి, కళాపీఠం వైస్ ప్రిన్సిపాల్ చింతా రవిబాలకృష్ణ, పతాక రూపశిల్పి కృష్ణ, పలువురు కళాకారులు, గ్రామస్థులు స్థూపానికి స్వాగతం పలికారు.



యానాదులకు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

యానాదులకు చేపల వేట సామగ్రి పంపిణీ

నాగాయలంక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): చేపల వేటపై ఆధారపడి జీవిస్తున్న యానాది కుటుంబాల జీవన ప్రమాణాలను పెంచేందుకు కృషి చేస్తున్నట్టు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. గురువారం నాగాయలంక శ్రీరామపాదక్షేత్రంలోని ఫుడ్ కోర్టు వద్ద జరిగిన కార్యక్రమంలో కోడూరు, నాగాయలంక మండలాలకు చెందిన 80 మంది నిరుపేద యానాది మత్స్యకార కుటుంబాలకు నాబార్డ్ ట్రైబల్ డెవలప్‌మెంట్ (టిడిఎఫ్) ద్వారా, ప్రజా ప్రగతి సేవా సంస్థ అధ్యక్షులు పరుచూరి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో రూ.50 లక్షల విలువైన పడవలు, ఐస్ బాక్సులు, వేట సామగ్రిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ప్రతిభ, యానాది సంఘ నేతలు నక్కా విజయబాబు, శ్రీనివాసరావు, మత్స్యకార నాయకులు లకనం నాగాంజనేయులు, కర్రి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ముప్పాళ్ల సర్పంచ్‌కు రాష్ట్రపతి అవార్డు ప్రదానం

చందర్లపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ముప్పాళ్ల గ్రామ సర్పంచ్ కుసుమరాజు వీరమ్మ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి జాతీయ పురస్కారం అందుకున్నారు. దీన్‌దాళ్ ఉపాధ్యాయ్ పంచాయతీ సతత్ వికాస్ పురస్కారాలకు ముప్పాళ్ల పంచాయతీ ఎంపికైంది. గురువారం ఢిల్లీలోని రాష్ట్రపతిభవన్‌లో గ్రామం తరఫున సర్పంచ్ వీరమ్మ అవార్డును అందుకున్నారు. సామాజిక భద్రత, సామాజిక రక్షణ వంటి అంశాలపై ముప్పాళ్లకు ఈ పురస్కారం లభించింది. అవార్డు అందుకున్న వీరమ్మకు గ్రామస్థులు అభినందనలు తెలిపారు.



రాష్ట్రపతి అవార్డు అందుకుంటున్న ముప్పాళ్ల సర్పంచ్ వీరమ్మ



గెలుపొందిన మజ్దూర్ యూనియన్ నాయకులు

మజ్దూర్ యూనియన్ ఘన విజయం

ఇబ్రహీంపట్నంరూరల్, డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): గుంటుపల్లి రైల్వే వ్యాగన్ వర్క్‌షాపులో ఈనెల 4, 5న జరిగిన రైల్వే ట్రేడ్ యూనియన్ గుర్తింపు సీక్రెట్ బ్యాలెట్ ఎన్నికల్లో సౌత్ సెంట్రల్ రైల్వే మజ్దూర్ యూనియన్ ఘనవిజయం సాధించింది. మజ్దూరు యూనియన్‌కు 809 ఓట్లు రాగా సౌత్ సెంట్రల్ రైల్వే ఎంప్లాయిస్ సంఘ్‌కు 757 ఓట్లు వచ్చాయి. 52 ఓట్ల మెజార్టీతో మజ్దూర్ యూనియన్ గెలుపొందింది. ఈసందర్భంగా యూనియన్ వర్క్‌షాపు బ్రాంచ్ సెక్రటరీ ఎంవీఎం నాగేశ్వరరావు కార్మికులకు ధన్యవాదాలు తెలిపారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా పని చేస్తామన్నారు.

క్వారీలో విరిగిపడిన బండరాళ్లు

ఇబ్రహీంపట్నం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇబ్రహీంపట్నం మండలం కాచవరం గ్రామ పరిధిలోని రాతి క్వారీలో కొండరాళ్లు జారిపడిన ప్రమాదంలో కార్మికులు త్రుటిలో ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటనలో ఒక ట్రాక్టర్ నుజ్జునుజ్జవగా పొక్లెయిన్ తాత్కాలికంగా దెబ్బతిన్నట్టు తెలిసింది. పదే పదే బండరాళ్లు జారిపడుతున్నా, కార్మికుల ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నా క్వారీ యజమానులు సరైన జాగ్రత్తలు పాటించడం లేదని స్థానిక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు సైతం నిబంధనలు పాటించని క్వారీ యజమానులపై చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యంగా ఉంటున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



బండరాళ్లు జారి నుజ్జయిన ట్రాక్టర్

స్వర్ణాంధ్ర-2047కి సర్వ సన్నద్ధం



- విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణకు పకడ్బందీ ఏర్పాట్లు
- ఐఏఎస్ అధికారుల నేతృత్వంలో ప్రత్యేక బృందాల పర్యవేక్షణ



ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో పూర్తయిన వేదిక

కృష్ణలంక, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఐశ్వర్యం, ఆరోగ్యం, ఆనంద (వెల్తీ, హెల్తీ, హ్యాపీ) శోభిత ఆంధ్రప్రదేశ్ సాకారం లక్ష్యంగా స్వర్ణాంధ్ర-2047 విజన్ డాక్యుమెంట్ ఆవిష్కరణ కార్యక్రమం ఈనెల 13వ తేదీ శుక్రవారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో వైభవంగా జరగనుంది. ఇందుకోసం ఐఏఎస్ అధికారుల సారథ్యంలో ప్రత్యేక బృందాలు పకడ్బందీ ఏర్పాట్లు చేశాయి. 26 జిల్లాల నుంచి అతిథులు కార్యక్రమానికి హాజరుకానున్నారు. విద్య, మహిళా సాధికారత, టెక్నాలజీ, ఆరోగ్యం, వ్యవసాయం, స్వచ్ఛందసేవ.. ఇలా వివిధ విభాగాల్లో విశేష సేవలందిస్తున్న వారు ప్రత్యేక ఆహ్వానితులుగా కార్యక్రమంలో పాల్గొంటారు.



అధికారులకు సూచనలిస్తున్న కమిషనర్ బాబు.ఎ

500 బస్సులు, ప్రత్యేక పార్కింగ్‌లు

500 బస్సుల్లో రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు రానున్నారు. దాదాపు 30వేల మంది కార్యక్రమానికి హాజరుకానున్నారు. ఎవరికీ ఎలాంటి ఇబ్బంది లేకుండా ప్రణాళిక ప్రకారం ఏర్పాట్లు చేశారు. వివిధ జిల్లాల అధికారులతో సమన్వయానికి ప్రత్యేకంగా కమాండ్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశారు. 500 బస్సులతో పాటు కార్లకు అవసరమైన 24 పార్కింగ్ ప్రాంతాలు ఏర్పాటుచేశారు. బస్సుల కోసం ప్రత్యేకంగా ఏడు పార్కింగ్ ప్లేస్‌లను సిద్ధం చేశారు. పోలీసుశాఖ ఆధ్వర్యంలో పటిష్ఠ బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగింది.

పాసుల వారీగా గ్యాలరీలు

స్టేడియంలో వీవీఐపీ, వీఐపీ, పబ్లిక్ తదితర గ్యాలరీలకు ఇన్‌చార్జిలను నియమించి పాసులను కేటాయించారు. ప్రతి గ్యాలరీకి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు బృందాలను ఏర్పాటు చేశారు. పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్, ఎల్ఈడీ భారీ తెరలను ఏర్పాటు చేశారు. విజన్ డాక్యుమెంట్‌ను ప్రతిబింబించేలా 10 ఇతివృత్తాలతో ప్రదర్శనలు కార్యక్రమంలో భాగం కానున్నాయి. విజన్ డాక్యుమెంట్ ప్రజంటేషన్, స్టాళ్లు, నిరంతర విద్యుత్ సరఫరా, తాగునీటి సరఫరా, అల్పాహారం, పారిశుధ్యం, రవాణా, వైద్య శిబిరాలు తదితర ఏర్పాట్లను గురువారం ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో రాష్ట్ర పన్నుల చీఫ్ కమిషనర్ బాబు.ఎ, ముఖ్యమంత్రి కార్యదర్శి పీఎస్ ప్రద్యుమ్న, ప్రిన్సిపల్ సెక్రటరీ పీయూష్ కుమార్, సెర్ప్ సీఈవో జి.వీరపాండ్యన్, అదనపు కార్యదర్శి (ఫైనాన్స్) జె.నివాస్, శాప్ వీసీ అండ్ ఎండీ గిరీశ పీఎస్, ఐఅండ్‌పీఆర్ డైరక్టర్ హిమాన్షు శుక్లా తదితర రాష్ట్రస్థాయి అధికారులతో పాటు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ నిధి మీనా పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర బాబు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర తదితరులు చర్చించి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు జరుగకుండా కార్యక్రమాన్ని విజయవంతంగా చేయడానికి సమన్వయంతో పనిచేయాలని ఈ సందర్భంగా అధికారులకు సూచించారు.

స్టేడియంలో ఏర్పాట్ల పరిశీలన

లబ్బీపేట : స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమ ఏర్పాట్లలో ఎటువంటి లోపాలు లేకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. గురువారం స్టేడియంలో కార్యక్రమ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరపాలక సంస్థ ఏర్పాటు చేస్తున్న తాగునీటి సరఫరాలో ఎటువంటి లోపం లేకుండా చూసుకోవాలని, తాత్కాలిక మరుగుదొడ్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుండాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానెట్ జివిజిఎస్‌వి ప్రసాద్, ఇంచార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ సురేష్ బాబు, సూపరింటెండెంటింగ్ ఇంజనీర్(వర్క్స్) పి.సత్యనారాయణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ రామకోటేశ్వరరావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాస్, ఎస్టేట్ ఆఫీసర్ టి.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



స్టేడియంలో ఏర్పాట్లపై అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

పార్కింగ్ ఇలా..

స్వర్ణాంధ్ర విజన్-2047 కార్యక్రమానికి వచ్చే వీవీఐపీ, వీఐపీ, ప్రముఖులు, అధికారులు, మీడియా తదితర వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం 24 ప్రదేశాలను ఎంపిక చేశారు.

- మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, వివిధ కార్పొరేషన్ల చైర్మన్‌ల వాహనాలను స్టేడియం వెనుక వైపు గేట్ నంబరు2, 4 వద్ద నిలుపుకోవాలి.
- ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ల చైర్మన్లు, జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్‌ల వాహనాలను బిషప్ అజరయ్య స్కూల్ ప్రాంగణంలో నిలుపుకోవాలి.
- వివిధ జిల్లాల నుంచి వచ్చే ప్రముఖ వ్యక్తుల వాహనాలను వజ్ర గ్రౌండ్, సిద్ధార్థ మహిళా కళాశాల, సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్స్‌లో పార్కింగ్ చేసుకోవాలి.
- మీడియాకు సంబంధించిన వాహనాలను అంబేడ్కర్ విగ్రహం వెనుక వైపు ఉన్న గ్రౌండ్‌లో నిలుపుదల చేయాలి.
- వివిధ జిల్లాల నుంచి వచ్చే అధికారుల వాహనాలను సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ గ్రౌండ్స్, సబ్‌కలెక్టర్ కార్యాలయం, కలెక్టర్ కార్యాలయం, స్టేట్‌గెస్ట్‌హౌస్ ఏ ప్లస్ కన్వెన్షన్ సెంటర్‌లో నిలుపుదల చేయాలి
- అగ్రికల్చర్, టూరిజం, కల్చర్, ఎన్జీవో, హెల్త్‌కేర్, ఎస్‌హెచ్‌జీ, వెల్ఫేర్ విభాగాల నుంచి వచ్చే వాహనాలను బీఆర్టీఎస్ రోడ్డులో నిలుపుకోవాలి.
- హెల్త్‌కేర్, వీఐపీ ఇండస్ట్రీ, ఎంఎస్ఎంఈ, ఐటీ విభాగాల నుంచి వచ్చే వాహనాలను ఎంజీ రోడ్డులోని డీసీపీ బంగ్లా ఎదురుగా ఉన్న పార్థసారథి ప్రాంగణంలో నిలుపుదల చేయాలి.
- విద్యారంగానికి సంబంధించి వాహనాలను ఆర్‌అండ్‌బీ ఆఫీసు ప్రాంగణంలో నిలుపుదల చేయాలి.
- ఉత్తరాంధ్ర, ఉభయగోదావరి జిల్లాల నుంచి వచ్చే ప్రజలు, కార్యకర్తల వాహనాలను విశాలాంధ్ర రోడ్డులో ఉన్న శాతవాహన కళాశాల గ్రౌండ్స్‌లో పార్కింగ్ చేయాలి.
- కృష్ణాజిల్లా నుంచి వచ్చే వాహనాలను సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ప్రాంగణం, ఎన్టీఆర్ జిల్లా నుంచి వచ్చే వాహనాలను ఆంధ్రా లయోల కళాశాల ప్రాంగణం 1లో నిలుపుదల చేయాలి.
- రాయలసీమ, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచి వచ్చే వాహనాలను ఆంధ్రా లయోలా కళాశాల గ్రౌండ్-2లో పార్కింగ్ చేయాలి.
- పాసులు ఉన్న వారు, పారిశ్రామికవేత్తలు, ఎంఎల్ఎస్ విభాగాలకు చెందిన వాహనాలు స్టేడియం లోపల పార్కింగ్ చేయాలి.
- పోలీసుశాఖ వాహనాలను కమాండ్ కంట్రోల్ సెంటర్ ప్రాంగణంలో పార్కింగ్ చేయాలి.
- ప్రజలు, కార్యకర్తల వాహనాలను సీఎస్ఐ చర్చి, లయోలా కాలేజీ దేవయ్య ఆడిటోరిం, సిద్ధార్థ ఆడిటోరియం వద్ద నిలుపుదల చేయాలి.

ఆలపాటికి అఖండ విజయం చేకూర్చాలి

- ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్

గొల్లపూడి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థిగా పోటీలో ఉన్న మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ (రాజా) కోసం కూటమి కుటుంబసభ్యులంతా యుద్ధంలో సైనికుల్లా పనిచేసి ఆయన్ని అఖండ మెజార్టీతో గెలిపించాలని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ పిలుపునిచ్చారు. గొల్లపూడిలోని దత్త కల్యాణ మండపంలో గురువారం రాత్రి ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్లతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. తొలుత ఎన్టీఆర్ చిత్ర పటానికి అభ్యర్థి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ (రాజా), ఎమ్మెల్సీ పరుచూరి అశోక్ బాబుతో కలిసి వసంత పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మైలవరం నియోజకవర్గం నుంచి రికార్డు స్థాయిలో 16 వేల మంది గ్రాడ్యుయేట్లు ఓట్లను నమోదు చేసుకున్నారన్నారు. ఉమ్మడి కృష్ణా జిల్లాలోనే ఓట్ల చేరికలో మైలవరం నియోజకవర్గం ప్రథమ స్థానంలో కృష్ణా-గుంటూరు జిల్లాలో ద్వితీయ స్థానంలో ఉందన్నారు. కూటమి సభ్యులందరికీ ధన్యవాదాలు తెలిపారు. సాగునీటి సంఘాల ఎన్నికల్లోను సత్తా చాటాలన్నారు. టీడీపీ సభ్యత్వాల నమోదులోను 53వేలతో మైలవరం నియోజకవర్గం ఉమ్మడి కృష్ణా జిల్లాలో ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఇందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు. ఆలపాటికి అఖండ మెజార్టీ ఇచ్చి చంద్రబాబు నాయకత్వాన్ని మరింత బలపర్చాలని పిలుపునిచ్చారు. ఎమ్మెల్సీ పరుచూరు అశోక్‌బాబు మాట్లాడుతూ, కూటమి నేతలంతా ఎలాంటి బేధాభిప్రాయం లేకుండా ఉండటం అభినందనీయమన్నారు. అందరూ కలిసికట్టుగా పనిచేసి రాజాను అఖండ మెజార్టీతో గెలిపించాలన్నారు. ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ, వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఈప్రాంతానికి తీరని అన్యాయం చేశాడన్నారు. ఓట్ల నమోదులో తన నియోజకవర్గంను ప్రథమ స్థానంలో నిలిపిన వసంతకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. గత ప్రభుత్వ పాలనలో ప్రజలు ఏ రకంగా నష్టపోయారో కళ్లారా చూశామన్నారు. రాష్ట్రంలో ఐదు కోట్లమంది ప్రజలు వైసీపీ పాలనతో అసహనం చెందారన్నారు. స్వాతంత్ర్యం రాకముందు బ్రిటీష్ వాళ్ల పాలన ఎలా ఉందో దాన్ని కళ్లకు కట్టినట్టు జగన్ చూపించాడు కనుకే ప్రజలు ఆయనను 11 సీట్లకే పరిమితం చేశారన్నారు. ఈసమావేశంలో కూటమి నేతలు పాల్గొన్నారు.



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వసంత, వేదికపై ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, ఎమ్మెల్సీ అశోక్‌బాబు



కొల్లు రవీంద్రను పరామర్శిస్తున్న దేవినేని ఉమా, కొనకళ్ల నారాయణ, కాగిత కృష్ణప్రసాద్, వెనిగండ్ల రాము తదితరులు

మంత్రి కొల్లు రవీంద్రకు కూటమి నేతల పరామర్శ

- కొల్లు వెంకటరమణ అంతిమయాత్రలో నేతలు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మంత్రి కొల్లు రవీంద్ర సోదరుడు కొల్లు వెంకటరమణ హఠాన్మరణంపై ఉమ్మడి కృష్ణాజిల్లా టీడీపీ, జనసేన ఎమ్మెల్యేలు గురువారం సంతాపం వ్యక్తం చేశారు. మచిలీపట్నంలో రవీంద్ర ఇంటి వద్ద దివంగత కొల్లు వెంకటరమణ పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రవీంద్రను ఎమ్మెల్యేలు మండలి బుద్ధ ప్రసాద్, కాగిత కృష్ణ ప్రసాద్, వెనిగండ్ల రాము, బోడె ప్రసాద్, వర్ల కుమార్‌రాజా, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణ, దేవినేని ఉమామహేశ్వరరావు, రావి వెంకటేశ్వరరావు, బండి రామకృష్ణ తదితరులు పరామర్శించారు. వెంకటరమణ అంతిమయాత్రలో రవీంద్ర, బండి రామకృష్ణతో పాటు నియోజకవర్గ టీడీపీ నేతలు కొనకళ్ల బుల్లయ్య, గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, ఇలియాస్ పాషా, బత్తిన దాసు తదితరులు పాల్గొన్నారు.



17న ఉయ్యూరులో జాబ్‌మేళా

ఉయ్యూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధికల్పన శాఖ, డీఆర్డీఏ - సిడాప్, ఎన్ఏసీ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉద్యోగావకాశాలు కల్పించేందుకు ఈనెల 17న ఉయ్యూరులో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు జిల్లా ఉపాధి కల్పన అధికారి డి.విక్టర్‌బాబు, నైపుణ్యాభివృద్ధి అధికారి పి.నరేశ్‌కుమార్ గురువారం ఓ సంయుక్త ప్రకటనలో తెలిపారు. బస్టాండ్ సమీపాన శ్రీలంక కాలనీలో ఎన్ఏసీ ట్రైనింగ్ సెంటర్‌లో జరిగే జాబ్ మేళాలో బజాజ్ క్యాపిటల్, మెడ్‌ప్లస్ హెల్త్‌సర్వీసెస్, గూగుల్ పే వంటి ప్రముఖ కంపెనీలు పాల్గొంటాయని తెలిపారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఫార్మసి పూర్తిచేసి 18 నుంచి 35 సంవత్సరాల లోపు వారు అర్హులని, ఎంపికైన వారికి నెలకు రూ. 12 వేల నుంచి రూ. 20వేల వరకు అనుభవాన్ని బట్టి వేతనంతో పాటు ఇతర సౌకర్యాలు ఉంటాయని తెలిపారు.

దుర్గగుడిలో దక్షిణామూర్తికి ప్రత్యేక పూజలు

వన్‌టౌన్ డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దుర్గామల్లేశ్వర దేవస్థానం మల్లేశ్వరాలయ కుడ్యంలో ఉన్న దక్షిణామూర్తికి గురువారం ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆలయ ఈవో కె.ఎస్.రామరావు దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. జ్ఞానాన్ని కలిగించే దక్షిణామూర్తికి ఆలయ అర్చకులు పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అర్చనలు, షోడశోపచార పూజలను నిర్వహించి, మంత్రపుష్పం ఇచ్చారు.



అమరావతి రైతుల ప్లాట్లకు ఈ-లాటరీ

తుళ్లూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాజధాని అమరావతి రైతుల రిటర్నబుల్ ప్లాట్లకు విజయవాడ సీఆర్డీఏ కార్యాలయంలో గురువారం ఈ- లాటరీ నిర్వహించారు. ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు రాజధానిలో తొమ్మిది రిజిస్ట్రేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని సీఆర్డీఏ అదనపు ల్యాండ్స్ డైరెక్టర్ బీ ఎల్ రాజకుమారి తెలిపారు. లాటరీలో ప్లాట్లు పొంది ప్రొవిజనల్ సర్టిఫికెట్లు అందుకున్న రైతులు వారం రోజులలోపు సంబంధిత రిజిస్ట్రేషన్ కేంద్రాలకు వెళ్లి రిజిస్ట్రేషన్ క్రతువు పూర్తి చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్ ర్యాండమ్ సిస్టమ్ ద్వారా ఈ-లాటరీ నిర్వహించారు. మొత్తం 14 గ్రామాలకు చెందిన 261 మంది రైతులకు రెసిడెన్షియల్-130, కమర్షియల్-113 ప్లాట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో సీఆర్డీఏ ఆఫీసు మేనేజర్ వల్లభనేని శ్రీనివాసరావు, ఎస్టేట్ జాయింట్ డైరెక్టర్ వి.డేవిడ్ రాజు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.



రైతులకు ప్లాటు పత్రాలు అందజేస్తున్న అదనపు ల్యాండ్స్ డైరెక్టర్ రాజకుమారి

పోస్టుల భర్తీకి దరఖాస్తులు..

మచిలీపట్నంటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : వైద్యఆరోగ్యశాఖలో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసేందుకు దరఖాస్తులు సమర్పించాలని డిఎంహెచ్‌వో జి.గీతాబాయి కోరారు. జనరల్ ఫిజీషియన్ 1, 5 స్టాఫ్ నర్స్, 1 ఆడియాలజిస్టు, 2 మేనేజర్ పోస్టులకు దరఖాస్తులను ఈనెల 17లోగా సమర్పించాలన్నారు.



హద్దు మీరుతున్నారు!

- తెలంగాణకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాల సీజ్

జగ్గయ్యపేట రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చిల్లకల్లు వద్ద జాతీయ రహదారిపై తెలంగాణాకు అక్రమంగా ఇసుక తరలిస్తున్న ఆరు లారీలను గురువారం ఎస్ఐ తోట సూర్య శ్రీనివాస్ అదుపులోకి తీసుకుని వేర్వేరు కేసు నమోదు చేశారు. చందర్లపాడు మండలం కాసరబాద ఇసుక ర్యాంపులో లోడ్ చేసుకుని వస్తున్నట్టు డ్రైవర్‌లు తెలిపినట్టు చెప్పారు. వాహనాల వద్ద ఇసుకకు సంబంధించిన ఎటువంటి పత్రాలు లేవన్నారు. తెలంగాణాకు చెందిన నాతి అశోక్, దొంతగాని నగేష్, కర్నాటి సత్యనారాయణ, కర్నాటి శేఖర్, బైరు బాలకిషన్, గండు ఆంజనేయులు డ్రైవర్‌లపై కేసు నమోదు చేసినట్టు చెప్పారు.

కలెక్టర్ ఆదేశాలు బేఖాతరు!

ఇసుక రీచ్‌ల్లో తెలంగాణా రిజిస్ట్రేషన్ వాహనాలకు ఇసుక లోడ్ చేయవద్దని జిల్లా అధికారులకు ఆదేశాలున్నా క్షేత్రస్థాయిలో నిబంధనలను తుంగలో తొక్కి ఏ వాహనానికైనా ఇసుక లోడ్ చేస్తున్నారనటానికి పట్టుబడుతున్న తెలంగాణా వాహనాలే నిదర్శనం. అంతే కాకుండా ఆయా రీచ్‌ల్లో ఎస్కవేటర్లను కూడా వినియోగించి ఇసుక లోడ్ చేస్తున్నా ఏ శాఖ అధికారి స్పందించకపోవటంపై ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. కలెక్టర్ ఆదేశాలను బేఖాతరు చేసి ఓవర్ లోడ్ చేస్తుండటం గమనార్హం.

పట్టించుకోని రవాణా శాఖాధికారులు

నిబంధనల ప్రకారం ఓవర్ లోడ్‌తో వెళ్లే వాహనాలతో పాటు వాహనాల రిజిస్ట్రేషన్, నంబర్ ప్లేట్‌లు, నంబర్ ప్లేట్‌ల అమరిక, పర్మిట్‌లపై దృష్టి సారించి దాడులు చేయాల్సిన రవాణాశాఖ అధికారులు ఇసుక అక్రమార్కులు ఇచ్చే ముడుపులతో ఆ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదనే ఆరోపణలు సర్వత్రా వినబడుతున్నాయి. పట్టుబడిన వాహనాలలో ఒకదానికి మినహా ఏ వాహనానికి కూడా నంబర్ ప్లేట్‌లు లేవు. ఒదు భాగంలో ఉన్నవి కూడా అరకొరగా కనిపించేలా ఏర్పాటు చేసుకున్నారు. వాహనాలకు ఏపీ రోడ్డులోకి పర్మిట్ కూడా లేదని సమాచారం.

నడకుదురు రేవులో..

చల్లపల్లి : ఇసుక అక్రమంగా తరలిస్తున్న ఏడు ట్రాక్టర్లను చల్లపల్లి పోలీసులు అడ్డుకుని కేసులు నమోదు చేశారు. నడకుదురు రేవులో ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు గురువారం తెల్లవారుజామున ఎస్ఐ సుబ్రహ్మణ్యం సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించారు. అప్పటికే రేవులో రెండు ట్రాక్టర్లు లోడుతో ఉండగా, మిగిలిన ట్రాక్టర్లలో ఇసుకను లోడు చేస్తున్నారు. ఇసుక లోడుతో ఉన్న రెండు ట్రాక్టర్లు, ఐదు ఖాళీ ట్రాక్టర్లను ఎస్ఐ సీజ్‌చేసి చల్లపల్లి స్టేషన్‌కు తరలించారు. నిందితులపై కేసులు నమోదు చేసినట్టు ఎస్ఐ సుబ్రహ్మణ్యం తెలిపారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	98, 106, 117
చికెన్ విత్ స్కిన్	188
చికెన్ స్కిన్‌లెస్	198

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ.630



ఉత్తమ ఉపాధ్యాయుడు రమణకు సత్కారం

ఉయ్యూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : జిల్లాస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుడు పురస్కారం అందుకున్న జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు జీవీ రమణను రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్బుల ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సత్కరించారు. రోటరీ క్లబ్ అధ్యక్షుడు చొప్పరపు సుబ్రహ్మణ్యం. జిల్లా క్లబ్ ప్రతినిధులు సంపత్‌కుమార్, సయ్యద్‌అనీస్, కార్యదర్శి మీర్‌బాష, మాజీ అధ్యక్షురాలు శ్యామలాదేవి, ఇన్నర్‌వీల్ క్లబ్ సభ్యులు సూర్యకుమారి, ఉప్పాల పద్మ, మాధురీ రాణి తదితరులు రమణ దంపతులకు పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు.



సత్కరిస్తున్న రోటరీ, ఇన్నర్‌వీల్ క్లబ్‌లు

విద్యుత్ సరఫరా నిలిపివేత రేపు

హనుమాన్‌జంక్షన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): హనుమాన్‌జంక్షన్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్లు మరమ్మతు కారణంగా శనివారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు జంక్షన్ సబ్‌స్టేషన్ ఏఈ జీవీ డీ ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బాపులపాడు, శేరీనరసన్నపాలెం, కె. సీతారాంపురం, ముందడుగు కాలనీలకు విద్యుత్ సరఫరా ఉదయం 8 నుంచి 11గంటలు వరకు నిలిపి వేస్తున్నట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఉయ్యూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉయ్యూరు నగర పంచాయతీ, మండల పరిధిలో ఖాళీగా ఉన్న రేషన్‌షాపుల డీలర్ల పోస్టులకు ఆర్డీవో షారోన్ నోటిఫికేషన్ విడుదల చేశారు. పట్టణంలో 7వ వార్డు షాపు బీసీ-ఏ మహిళ, 3, 6 వార్డుల్లో దుకాణాలకు మెరిటోరియస్ స్పోర్ట్స్ పర్సన్(జనరల్)కు, 16వ వార్డులో షాపునకు బీసీ-ఏ, 13, 14 వార్డుల్లో షాపులకు ఎస్టీ మహిళలు, 10, 12 వార్డుల్లో షాపులకు బీసీ-బీ మహిళలు, చినఓగిరాల షాపునకు ఈడబ్ల్యూఎస్, ముదునూరు షాపునకు బీసీ-డీ మహిళలకు కేటాయించినట్లు తెలిపారు. ఆసక్తికల, అర్హులైన వారు ఈ నెల 24లోగా దరఖాస్తులు తహసీల్దార్ కార్యాలయంలో అందచేయాలని, అభ్యర్థులకు ఈనెల 29న ఉయ్యూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో రాతపరీక్ష ఉంటుందని తెలిపారు.

ఆందోళనలో .. అన్నదాతలు

• వాతావరణంలో మార్పులు - రైతుల గుండెల్లో గుబులు • ఆరబోసిన ధాన్యం రాశులను కాపాడుకునేందుకు ప్రయత్నాలు

(ఉంగుటూరు, ఆంధ్రజ్యోతి): బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులవల్ల ఆకాశంలో కమ్ముకున్న మబ్బులతో రైతుల గుండెల్లో గుబులు పుడుతోంది. ఆరుగాలం చెమటోడ్చి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో సంభవించే ప్రకృతివైపరీత్యాలకు రైతులు కలత చెందుతున్నారు. ఫెంగల్ తుఫాన్ భయంతో వరికోతలు వాయిదా వేసుకున్న రైతులు తుఫాన్ ముప్పు తప్పడంతో మళ్లీ కోతలు ముమ్మరం చేశారు. ఈ తరుణంలో బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడిందన్న వార్త రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. వాయుగుండం ప్రభావంతో కురిసే అకాల వర్షాలకు భయపడి ఇంకా వరికోతలు ఆపితే పంట బుగిలిపోయి పొలంలోనే గింజ రాలిపోతుందని, ఏవిధంగా చూసినా పంట నష్టం తప్పదని రైతులు దిగాలుపడుతున్నారు. మరికొంతమంది ధైర్యంచేసి వలస కూలీలు, వరికోత మిషన్ల(హార్వేస్టర్లు)తో హడావుడిగా కోతలు పూర్తి చేయిస్తున్నారు.

ధాన్యపురాశులను కాపాడుకునేందుకు రైతుల తంటాలు

నూర్పిడి చేసిన ధాన్యాన్ని కళ్లాలు, రోడ్లపక్క ఆరబోసే పనుల్లో నిమగ్నమైన రైతులు అల్పపీడనం ప్రభావంతో ఆకాశం మేఘావృతమై పలుచోట్ల చిరు జల్లులు పడటంతో ధాన్యపురాశులు తడవకుండా కాపాడుకునేందుకు టార్పాలిన్లతో నానా తంటాలు పడ్డారు.



వరికోత కోస్తున్న హార్వెస్టర్



ధాన్యపురాశులపై పరదాలు కప్పుతున్న రైతులు

మసక వాతావరణంతో ధాన్యంలో తగ్గని తేమశాతం

వరికోత మిషనతో కోతకోయించిన ధాన్యాన్ని వారంరోజులుగా రోడ్డుపక్కన ఆరబెడుతున్నా, మసక వాతావరణంవల్ల ధాన్యంలో తేమ 25శాతం కన్నా తగ్గటంలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. రైతుసేవా కేంద్రాల్లో 17శాతం తేమ వున్న ధాన్యం మిల్లులకు చేరే సరికి 20నుంచి 23శాతం గావుందని చెప్పి మిల్లర్లు కోత విధిస్తున్నారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ఈనేపథ్యంలో దళారీలు, కమిషన్ బేరగాళ్లకు బస్తాకి రూ.350లనుంచి రూ.400ల నష్టానికి ధాన్యాన్ని తెగ నమ్ముకోవాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తేమ శాతంలో వ్యత్యాసాలు రాకుండా చూడాలి

పీపీసీ కేంద్రాలు, మిల్లుల మధ్య తేమ శాతంలో వస్తున్న వ్యత్యాసాలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి సరిచేయాలని, రైతుసేవా కేంద్రాల ద్వారా అధిక మొత్తంలో ధాన్యం కొనుగోళ్లు జరిగేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.



ఎల్వోసీలను అందిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్వోసీల పంపిణీ

పెనమలూరు, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్యపరంగా వివిధ రకాలుగా ఇబ్బందులు పడుతున్న నియోజకవర్గానికి చెందిన ముగ్గురు వ్యక్తులకు రూ.15.5 లక్షల ముఖ్యమంత్రి సహాయనిధి ఎల్వోసీలను స్థానిక ఎమ్మెల్యే బోడె ప్రసాద్ గురువారం పంపిణీ చేశారు. పెదపులిపాకకు చెందిన షాపురా బేగంకు నాలుగు లక్షలు, ఉయ్యూరుకు చెందిన షయాన్‌సాజిల్‌కు పదిలక్షల, పోరంకికి చెందిన వంగూరి వీర వెంకటసారథికి లక్షన్నర విలువైన ఎల్వోసీలను ఆయన అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, కోయ ఆనంద్ ప్రసాద్, ముసునూరు శ్రీనివాసరావు, తుమ్మల రాంకుమార్, పీతా గోపీచంద్, బోడె సురేంద్ర, మాదు వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రాధాన్యత క్రమంలో అభివృద్ధి

కంకిపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రాధాన్యత క్రమంలో గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నామని కంకిపాడు గ్రామ సర్పంచ్ బాకి రమణ అన్నారు. స్థానిక సర్పంచ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండల కేంద్రమైన కంకిపాడులో సుమారు రూ. కోటితో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. ప్రాధాన్యత క్రమంలో గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్నామన్నారు. అదే విధంగా కంకిపాడు గ్రామంలో కుక్కల బెడద అధికంగా ఉందన్నారు. కుక్కల పట్టుకు వెళ్లేందుకు అవసరమైన టెండర్లు పిలవగా ఎవరూ రాలేదన్నారు. మరోసారి టెండర్ల పిలవనున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి కిరణ్మయి, ఈవో శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నష్టపరిహారం చెల్లించండి

సీపీఎం ఉంగుటూరు మండల కమిటీ కార్యదర్శి అజ్మీర

గుడివాడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గన్నవరం నియోజకవర్గం ముక్కపాడు, లంకపల్లి, ఎలుకపాడు, వెల్దిపాడు గ్రామాల్లో బుడమేరు వరదల్లో నీటమునిగిన ఇళ్లకు నష్టపరిహారం చెల్లించలేదని, ఆయిల్ ఇంజన్లు, విద్యుత్ మోటార్లు మరమ్మతులకు నష్టపరిహారం అందించాలని సీపీఎం ఉంగుటూరు మండల కమిటీ కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు కోరారు. గురువారం స్థానిక ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అజ్మీర మాట్లాడుతూ లంకపల్లి, ముక్కపాడు గ్రామాల జాబితాను కలెక్టర్ కార్యాలయానికి పంపామని, నేరుగా బాధితుల బ్యాంకు ఖాతాల్లో నష్టపరిహారం జమ అవుతుందని ఆర్డీవో తెలిపినట్లు పేర్కొన్నారు. మిగిలిన రెండు గ్రామాలకు సంబంధించి తహసీల్దార్ కార్యాలయం నుంచి ఎటువంటి ప్రతిపాదనలు రాలేదని ఆర్డీవో పేర్కొన్నారని అజ్మీర తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు టి.వి లక్ష్మణరావు, లంకపల్లి గ్రామస్తులు సంపత్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి

• ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న జరగనున్న సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను పారదర్శంగా నిర్వహించాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు కృష్ణా, ఏలూరు డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కె.బాబుకు సూచించారు. గురువారం విజయవాడ యార్లగడ్డ కార్యాలయంలో ఎన్నికల నిర్వహణ ప్రక్రియపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ పంటలకు సాగు, గ్రామాలకు తాగునీటి విడుదలలో కీలకపాత్ర పోషించే ఈ సంఘాలను గత వైసీపీ ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేసిందని మండిపడ్డారు. ఫలితంగా కాలువల నిర్వాహణ సరిగ్గా లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెప్పారు. సాగునీటి ఇబ్బందులు తొలగించి చివరి భూములకు నీరందించేలా పర్యవేక్షణ చేసేందుకు సాగునీటి సంఘాలు దోహదం చేస్తాయన్నారు. గన్నవరం 152 ప్రాదేశిక నియోజకవర్గాలు ఉన్నాయని ఈఈ కె.బాబు ఎమ్మెల్యేకు వివరించారు. ఒక్కో ప్రాదేశిక నియోజకవర్గానికి 12 మంది సభ్యులను చేతులెత్తే పద్ధతిలో ఎన్నుకుంటారని, వీరిలో నుంచి ఇరువురిని అధ్యక్షుడు, ఉపాధ్యక్షులుగా ఎన్నుకుంటారని తెలిపారు. అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా ఎన్నికైన వారు అదే రోజు జిల్లాలోని 209 సాగునీటి వినియోగదారుల సంఘాలకు సర్వసభ్య సమావేశం నిర్వహిస్తారని, ఈ ప్రక్రియ పూర్తైన తరువాత ఈ నెల 17న జిల్లాలోని 26 డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారని, అనంతరం ప్రాజెక్టు కమిటీ ఎన్నికను నిర్వహిస్తానని ఈఈ వివరించారు.



అధికారుల సమావేశంలో ఎమ్మెల్యే యార్లగడ్డ

ఈడుపుగల్లును ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలి

• మాజీ ఎంపీపీ దేవినేని రాజా

కంకిపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి):మండలంలోనే ఈడుపుగల్లు గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దాలని కంకిపాడు మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు దేవినేని రాజా అన్నారు. మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులకు గురువారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన దేవినేని రాజా మాట్లాడుతూ పెనమలూరు నియోజకవర్గంలోనే ఈడుపుగల్లు గ్రామాభివృద్ధికి సర్పంచ్ పంది పాటి ఇందిర విశేషంగా కృషి చేస్తున్నారని తెలియజేశారు. సర్పంచ్, సీహెచ్‌సీ డైరెక్టర్ రవికిషోర్, టీడీపీ జిల్లా కార్యదర్శి సుధాకర్, పాల్గొన్నారు.



శంకుస్థాపన చేస్తున్న మాజీ ఎంపీపీ రాజా

ఇరిగేషన్ స్థలం స్వాధీనం

ప్రసాదంపాడు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రామవరప్పాడు గ్రామంలోని ఇరిగేషన్ స్థలాన్ని ఆక్రమించి నిర్మించిన రేకుల షెడ్డు కూల్చివేత పనులు ప్రారంభించినట్లు ఈవో గంటా రామ్మోహన్‌రావు తెలిపారు. గురువారం ఇరిగేషన్, రెవెన్యూ, పంచాయతీ అధికారుల ఆధ్వర్యంలో ఇరిగేషన్ స్థలంలోని నిర్మాణాల కూల్చివేత పనులు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ టి. జానకి దేవి ఇరిగేషన్‌కు చెందిన స్థలాన్ని ఆక్రమించారన్నారు. దీనిపై ఇరిగేషన్, పంచాయతీ అధికారులు కోర్టును ఆశ్రయించారని వెల్లడించారు. స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని న్యాయస్థానం ఉత్తర్వులు ఇవ్వడంతో రేకుల షెడ్డు నిర్మాణాన్ని కూల్చినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఇరిగేషన్, పంచాయతీ, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



ఆక్రమణలు తొలగిస్తున్న సిబ్బంది

రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలి

• తహసీల్దార్ కేవీ శివయ్య

గన్నవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ కేవీ శివయ్య అన్నారు. మండలంలోని చిక్కవరం పంచాయతీ కార్యాలయం వద్ద రెవెన్యూ గ్రామ సభ గురువారం జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ శివయ్య మాట్లాడుతూ రైతులు తమ భూముల సమస్యలను అర్జీల రూపంలో ఇస్తే పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. చాలా కాలంగా భూములు సాగు చేస్తూ వారసత్వంగా సంక్రమించిన పొలాలకు పట్టాదారు పాస్‌పుస్తకాలు మంజూరు చేయాలని అడంగల్ కరెక్షన్స్, సర్వే ఫలితాల్లో తేడాలు ఉన్నాయని రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. మొత్తం 32 అర్జీలు రాగా మ్యూటేషన్‌కు 24, ఎఫ్‌లైన్‌కు 5 అడంగల్ కరెక్షన్‌కు రెండు, రీప్లేస్‌మెంట్‌కు అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ శివయ్య తెలిపారు. సర్పంచ్ అన్నే లక్ష్మణరావు, రేపూరి శివరామకృష్ణ, చిట్టినేని రవిబాబు తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్ కేవీ శివయ్య

సుస్థిర లక్ష్యాలపై శిక్షణ

ఉయ్యూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపరచి, పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రత పాటించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలని ఎంపీడీవో జీఎస్‌వి శేషగిరిరావు అన్నారు. కాటూరు గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద గురువారం లోకలైజేషన్ ఆఫ్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ గోల్స్ సుస్థిర లక్ష్యాలపై సర్పంచ్‌లు, కార్యదర్శులు, గ్రామ సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మాట్లాడుతూ పేదరిక నిర్మూలన, ఆకలిబాధల నివారించి ఆహార భద్రత కల్పించి పోషకత్వాన్ని మెరుగుపరచాలన్నది లక్ష్యమన్నారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ శ్రీనివాసరావు, రిటైర్డు ఎంఈవో కేపీ విశ్వమోహన్ మాట్లాడారు. ఏపీఎం అమరేశ్వరరావు, ఈవోపీఆర్డీ ఏఎస్ఆర్ కోటేశ్వరరావు, సర్పంచ్ కొడాలి ఆశాజ్యోతి పాల్గొని పలు సూచనలు చేశారు.



మాట్లాడుతున్న ఎంపీడీవో శేషగిరిరావు



విజయవాడ : అప్సరసినిమాస్	బెంజిసర్కిల్ : క్యాపిటల్ సినిమాస్
ఎంజిరోడ్ : లైలా INOX	లబ్బీపేట : పివిపిసినీపోలీస్
పటమట : LEPL INOX	ఆటోనగర్ : పవర్‌సినీపోలీస్
వన్‌టౌన్ : సాయిరామ్ స్క్రీన్స్	పాయకాపురం : రవీంద్రసినిమాస్
పోరంకి : బాలాజీ సినీవిల్లా	కంకిపాడు : శ్రీవిజయలక్ష్మి
మచిలీపట్నం : సిరి కాంప్లెక్స్	మచిలీపట్నం : వరం సెంట్రల్‌మాల్
గుడివాడ : మిని భాస్కర్	నూజివీడు : ద్వారకకాంప్లెక్స్
తిరువూరు : శ్రీకృష్ణాటాకీస్	పామర్రు : గగన్‌మహల్

కృష్ణాజిల్లా : మరీదు వెంకటేశ్వరరావు
త్రూ క్రేజీ సినిమాస్ రిలీజ్

నేడే బ్రహ్మాండమైన విడుదల



జయరాం	- విజయవాడ
సాయిరాం	- విజయవాడ-1
క్యాపిటల్ సినిమాస్	- విజయవాడ
పివిపి సినీపోలీస్	- విజయవాడ
రేవతి	- మచిలీపట్నం
భాస్కర్	- గుడివాడ
అలంకార్ సినిమాస్	- జగయ్యపేట
తారా స్క్రీన్-2	- పాయకాపురం
వెంకటేశ్వర పిక్చర్ ప్యాలస్	- తిరువూరు
సత్యనారాయణ	- నూజివీడు
లక్ష్మి ప్రసన్న	- నందిగామ
దీపక్ మహల్	- ఉయ్యూరు
మాగంటి	- కైకలూరు
స్వర్ణ కాంప్లెక్స్	- ఇబ్రహీంపట్నం

భువనేశ్వరీ పీఠానికి వెంకయ్యనాయుడు రాక నేడు

గన్నవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కేసరపల్లి శివారు సచ్చిదానంద ఆశ్రమంలోని శ్రీ భువనేశ్వరీ పీఠానికి శుక్రవారం భారత మాజీ ఉప రాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు రానున్నారు. హైదరాబాద్ నుంచి విమానంలో గన్నవరం విమానాశ్రయానికి ఉదయం 10 గంటలకు వచ్చి అక్కడ నుంచి భువనేశ్వరీ పీఠానికి చేరుకుని శ్రీచక్ర నవావరణ అర్చనలో పాల్గొంటారని నిర్వాహకులు తెలిపారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా ఉంగుటూరు మండలం ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్టుకు వెంకయ్యనాయుడు వెళ్లనున్నారు. ఆయన రాక సందర్భంగా భువనేశ్వరీ పీఠం ప్రాంగణంలో పోలీసు అధికారులు భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

తిరుపతమ్మ ఆలయ అభివృద్ధికి విరాళం

గన్నవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాత గన్నవరంలోని శ్రీ లక్ష్మీ తిరుపతమ్మ ఆలయం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న సేవా సదనం నిర్మాణానికి హైదరాబాద్‌కు చెందిన నర్రా కృష్ణారావు, కమల దంపతులు రూ.1,00,116 విరాళాన్ని గురువారం ఆలయ కమిటీ అధ్యక్షుడు జాస్తి శ్రీధర్‌కు అందజేశారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీధర్ మాట్లాడుతూ లక్ష్మీ తిరుపతమ్మ సేవా సదనం నిర్మాణానికి భక్తులు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని తెలిపారు. అందరి సహకారంతో అమ్మవారి వార్షిక కల్యాణానికి సేవా సదనాన్ని అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. ఆలయ కమిటీ సభ్యులు జాస్తి ఫణిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందజేస్తున్న కృష్ణారావు, కమల దంపతులు

సాగునీటి సంఘాల ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

• తహసీల్దార్ జాలాది విమలకుమారి

ఉంగుటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలపరిధిలో ఈనెల 14న జరిగే సాగునీటి సంఘాల ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తహసీల్దార్ జాలాది విమలకుమారి తెలిపారు. గురువారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడుతూ ఆత్కూరులో రెండు సాగునీటి సంఘాలు, ఉంగుటూరు, తేలప్రోలు, వేంపాడు, కొయ్యగూరపాడు, మానికొండలో ఒక్కొక్కటి చొప్పున మొత్తం 7 నీటి వినియోగదారుల సంఘాల(డబ్ల్యూయుఏ)లకు అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నికతోపాటు 82ప్రాదేశిక నియోజకవర్గాల(టీసీ)కు సభ్యుల ఎన్నిక జరిపేందుకు సర్వం సిద్ధం చేశామన్నారు. శనివారం ఉదయం 8గంటలకు తొలుత ప్రాదేశిక నియోజకవర్గ సభ్యుల ఎన్నిక ప్రక్రియ ప్రారంభమై మధ్యాహ్నం 12.30కు పూర్తవుతుందన్నారు. అదేరోజు సాయంత్రం 3గంటల నుంచి 5గంటలలోపు జరిగే ప్రత్యేక యాజమాన్య కమిటీ సమావేశంలో నీటివినియోగదారుల సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులను ఎన్నుకోవటం జరుగుతుందని తహసీల్దార్ పేర్కొన్నారు.

హనుమాన్‌జంక్షన్: ఈనెల 17న జరగనున్న నాగార్జున సాగర్ ఎడమ కాలువ కింద బాపులపాడు మేజర్ పరిధిలోని బాపులపాడు డీసీ నెం:13, కృష్ణా ఈస్ట్ డెల్టా(ఏలూరు కాలువ) పరిధిలోని కాకులపాడు డీసీ నెం 2,వేంపాడు మేజర్‌పరిధిలోని మడిచర్ల డీసీ నెం 17 ల ఎన్నికలకు సంబంధించి అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ మూడు డీసీల పరిధిలోని ప్రాదేశిక నియోజకవర్గాలకు, నీటి వినియోగదారుల సంఘాలకు ఈ నెల 14న ఆయా గ్రామాల్లో ఎన్నికలు నిర్వహించడానికి సన్నాహాలు పూర్తయ్యాయి.

కంకిపాడు : ఈ నెల 14వ తేదీ నుంచి జరగనున్న నీటి సంఘాల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ భవన్నారాయణ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం నీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై ఎన్నికల అధికారులకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భవన్నారాయణ మాట్లాడుతూ ఈ నెల 14న మండల పరిధిలోని రెండు డిస్ట్రిబ్యూటరీ కమిటీల పరిధిలో 8 సాగు నీటి సంఘాల ఎన్నికలు జరుగుతున్నాయని తెలియజేశారు. అధికారులు సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.



మాట్లాడుతున్న తహసీల్దార్ భవన్నారాయణ

ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 09240, 99854 11733, 99854 09286

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ కింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, జీఎం : 99854 11234

ఆంధ్రజ్యోతి డైలీ క్లాసిఫైడ్స్ DAILY CLASSIFIEDS

FLAT FOR SALE

తాడేపల్లిలో ఫ్లోర్‌కి 2 ఫ్లాట్స్ చొప్పున నిర్మించిన 3 BHK & 4 BHK (4272 Sft.) లగ్జరి ఫ్లాట్స్ ఈస్ట్/ వెస్ట్ ఫేసింగ్ 2 కార్‌పార్కింగ్‌తో అమ్మబడును. ✆ 92464 95388
AJB -389

WANTED

విజయవాడ మెట్రోపాలిటన్ హోటల్ వారికి స్టాఫ్ కావలెను. ఎలక్ట్రీషియన్, ప్లంబర్, సెక్యూరిటీ గార్డు, హెచ్.కె. సూపర్ వైజర్, హౌస్ కీపింగ్ బాయ్స్, వెయిటర్స్, ఆకర్షణీయమైన జీతం. సంప్ర : 7288 88 5598
AJB -1051

గోడౌన్ వర్కర్స్ & ఆటో డ్రైవర్స్ కావలెను. 35 సం.ల లోపు మగవారు మాత్రమే. విజయవాడలో పనిచేయవలెను. సంప్రదించండి : 93900 83900
AJB -10

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్
ప్రతి అవసరానికి - వేగవంతమైన ఫలితం
GST 5%
REAL ESTATE | SITUATION VACANT | TO LET | AUTOMOTIVE | COMPUTERS | HEALTH CARE | EDUCATION | ENTERTAINMENT
రూ. 290/-
కలర్ 30% EXTRA
1 టౌన్ : 99854 09286, పటమట : 99854 11868,
ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733,
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240

మీ కుటుంబసభ్యులు, బంధుమిత్రులు, శ్రేయోభిలాషులకు ఆంధ్రజ్యోతిలో ప్రకటనల ద్వారా తెలియజేయండి.



పూర్తి వివరములకు సంప్రదించండి: ఆంధ్రజ్యోతి ప్రాంతీయ కార్యాలయం
సర్వే నెం. 70/1 & 2, వెదురుపావులూరు, ముస్తాబాద,
గన్నవరం మండలం, కృష్ణాజిల్లా. సెల్ : 99854 01166
పటమట : 99854 11868, ఎం.జి.రోడ్, గొల్లపూడి : 99854 85777,
వన్‌టౌన్, భవానిపురం : 99854 09286, పెనమలూరు : 99854 09240,
మధురానగర్, ఎస్.ఎన్.పురం, గాంధీనగర్ : 99854 11733
గన్నవరం, కంకిపాడు : 99854 11733, 99854 09240



కేంద్ర మంత్రికి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎంపీ కేశినేని నాని

శ్రీ దుర్గా మల్లేశ్వరాలయానికి రూ.100 కోట్లు ఇవ్వండి

● కేంద్ర మంత్రి షెకావత్‌కు ఎంపీ నాని విజ్ఞప్తి

న్యూఢిల్లీ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి ప్రాంతంలోని అతిపెద్ద, ప్రాచీన దేవాలయం శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రసాద్ పథకం కింద రూ.100 కోట్లు మంజూరు చేయాలని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌కు టీడీపీ ఎంపీ కేశినేని చిన్ని విజ్ఞప్తి చేశారు. గురువారం, కేంద్ర మంత్రితో ఆయన నివాసంలో భేటీ అయిన ఎంపీ దుర్గగుడి అభివృద్ధి గురించి చర్చించారు. ఈ దేవాలయం అభివృద్ధికి ప్రసాద్ పథకం కింద రూ.100 కోట్లు విడుదల చేయాలని ఆగస్టులో చేసిన విజ్ఞప్తిపై త్వరగా చర్యలు తీసుకుని నిధులు మంజూరు చేయాలని కోరారు. తన విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులకు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆదేశించారని ఎంపీ కేశినేని మీడియాకు తెలిపారు.

బాలిక కిడ్నాప్ కథ సుఖాంతం

● పోలీసుల అదుపులో నిందితుడు రాహుల్?

గుడివాడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 7న కిడ్నాప్‌కు గురైన మైనర్ బాలిక (16) కథ సుఖాంతమైంది. గుడివాడ ఇన్‌చార్జ్ డీఎస్పీ షేక్ సుభాన్ ఆధ్వర్యంలో టూటౌన్ సీఐ సీహెచ్ నాగప్రసాద్ నేతృత్వంలో రెండు ప్రత్యేక బృందాల కృషి ఫలితంగా బాలికను సురక్షితంగా బుధవారం రాత్రి గుడివాడకు తీసుకువచ్చారు. నిందితుడు రాహుల్ పోలీసుల అదుపులో ఉన్నట్టు సమాచారం. బాలికను స్థానిక తహసీల్దార్, మండల మేజిస్ట్రేట్ వి.రామకోటేశ్వరరావు ఎదుట హాజరుపరచగా స్టేట్‌మెంట్‌ను రికార్డు చేసుకున్నారు. బాలిక రాకను తెలుసుకుని బంధువుల టూటౌన్ పోలీస్ స్టేషన్‌కు చేరుకున్నారు. రాహుల్‌ను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిందితుడు రాహుల్ తమను బెదిరిస్తున్నాడని బాలిక తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాహుల్‌పై కిడ్నాప్, రేప్, పోక్సో కేసును నమోదు చేసినట్టు టూటౌన్ పోలీసులు తెలిపారు. శుక్రవారం నిందితుడిని కోర్టులో హాజరుపరచనున్నట్టు సమాచారం.

మాపై ఎందుకు వివక్ష..!

● సమస్యల పరిష్కారం కోరుతూ గిరిజన సంక్షేమ గురుకులాల టీచర్లు, లెక్చరర్ల ధర్నా
● రేపటి నుంచి నిరసన బాట పడతామని హెచ్చరిక



ధర్నాలో పాల్గొన్న ఔట్‌సోర్సింగ్ టీచర్లు, లెక్చరర్లు, చిన్నారితో కలిసి ధర్నాలో పాల్గొన్న టీచర్

ధర్నాచౌక్, డిసెంబర్ 12 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఏపీ గిరిజన సంక్షేమ గురుకులాల్లో విధులు నిర్వర్తించే ఔట్‌సోర్సింగ్ టీచర్స్, లెక్చరర్లు కొన్ని రోజులుగా వివిధ రూపాల్లో తమ నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం చలో విజయవాడలో భాగంగా ఏపీ గిరిజన సంక్షేమ గురుకులాల ఔట్‌సోర్సింగ్ ఔట్ సోర్సింగ్ టీచర్స్, లెక్చరర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ధర్నాచౌక్‌లో ధర్నా చేపట్టారు. తమను కాంట్రాక్ట్ పద్ధతిలోకి మార్చి ఉద్యోగ భద్రత కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఇతర విభాగాల్లోని ఉద్యోగుల మాదిరిగా 12 నెలల వేతనాలు చెల్లించాలన్నారు. స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్, టీచర్స్ జేఏసీ చైర్మన్ ఏవీ నాగేశ్వరరావు ఈ దీక్షలో పాల్గొని సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం వీరిని అన్యాయంగా ఔట్‌సోర్సింగ్ పద్ధతిలోకి మార్చారని విమర్శించారు. పదేళ్ల నుంచి గిరిజన విద్యార్థులకు విద్యను అందిస్తున్న వీరికి ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన ప్రజా సమాఖ్య అధ్యక్షుడు కే రాజునాయక్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో పనిచేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉపాధ్యాయులు, లెక్చరర్ల పట్ల వివక్ష తగదన్నారు. సీఐటీయూ రాష్ట్ర ప్రధానకార్యదర్శి సీహెచ్ నర్సింగరావు మాట్లాడుతూ గిరిజన ఉపాధ్యాయులు తమ సమస్యల పరిష్కారానికి చేసే పోరాటాలకు తమ మద్దతును ప్రకటించారు. ఈ నెల 14, 15న విద్యార్థుల తల్లిదండ్రులను కలిసి మద్దతు కోరాలని, 16న ఐటీడీఏ/డీటీడబ్ల్యూ కార్యాలయాల వద్ద ధర్నాలు, 17న భిక్షాటన, 18న పిల్లలకు ధర్నా శిబిరాల్లో పాఠాలు చెప్పడం, 19న ఎమ్మెల్యేల ఇళ్ల వద్ద ధర్నాలు, సామూహిక వినతిపత్రాలు 20న విద్యార్థుల తల్లిదండ్రులతో పాఠశాలల ఎదుట నిరసనలు, 21న వంటావార్పు నిర్వహించాలని కమిటీ నిర్ణయించింది. అసోసియేషన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శి కే లక్ష్మీనాయక్, జే మల్లికార్జున నాయక్, కార్యనిర్వాహక అధ్యక్షురాలు ఎన్.సునీత అధిక సంఖ్యలో ఉపాధ్యాయులు, లెక్చరర్లు పాల్గొన్నారు.

నగరంలో నేడు ట్రాఫిక్ ఆంక్షలు



విజయవాడ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో శుక్రవారం నిర్వహించనున్న స్వర్ణాంధ్ర విజన్-2047 సందర్భంగా నగరంలో ట్రాఫిక్ ఆంక్షలు విధిస్తున్నట్టు పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖర్‌బాబు తెలిపారు. ఉదయం 5 నుంచి నుంచి సాయంత్రం 4గంటల వరకు ఆంక్షలు అమల్లో ఉంటాయి.

- హైదరాబాద్ - విశాఖపట్నం - హైదరాబాద్ మార్గంలో రాకపోకలు సాగించే వాహనాలు ఇబ్రహీంపట్నం, జి.కొండూరు, మైలవరం, నూజివీడు, హనుమాన్ జంక్షన్ మార్గంలో వెళ్లాలి.
- విశాఖపట్నం-చెన్నై- విశాఖపట్నం వైపు రాకపోకలు సాగించే వాహనాలను హనుమాన్ జంక్షన్ బైపాస్, గుడివాడ, పామర్రు, అవనిగడ్డ, రేపల్లె, బాపట్ల, చీరాల, త్రోవగుంట, ఒంగోలు మీదుగా మళ్లిస్తారు.
- గుంటూరు-విశాఖపట్నం-గుంటూరు వైపు రాకపోకలు సాగించే వాహనాలు బుండపాడు, తెనాలి, కొల్లూరు, వెల్లటూరు జంక్షన్, పెనుమూడి బ్రిడ్జి, అవనిగడ్డ, పామర్రు, గుడివాడ, హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్లాలి.
- చెన్నై-హైదరాబాద్-చెన్నై వైపు వాహనరాలు మేదరమెట్ల, అద్దంకి, పిడుగురాళ్ల, నడికుడి, మిర్యాలగూడ, నల్లగొండ, నార్కెట్‌పల్లి మీదు వెళ్లాలి.
- విశాఖపట్నం వైపు నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు రామవరప్పాడు రింగ్, గుణదల, బీఆర్టీఎస్ రోడ్డు, ఏలూరు లాకులు, పాత ప్రభుత్వాసుపత్రి, పీసీఆర్ జంక్షన్ మీదుగా పీఎన్‌బీఎస్‌కు వెళ్లాలి.
- మచిలీపట్నం నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులు ఆటోనగర్ గేటు, బెంజ్‌సర్కిల్, మహానాడు జంక్షన్, రామవరప్పాడు, ఏలూరు రోడ్డు, గుణదల, చుట్టుగుంట, దీప్తి జంక్షన్, అప్సర జంక్షన్, వీసీఆర్ మీదుగా పీఎన్‌బీఎస్‌కు వెళ్లాలి.
- పీఎన్‌బీఎస్ నుంచి విశాఖ వైపు వెళ్లే బస్సులు పీసీఆర్ జంక్షన్, ఆర్టీసీ వై జంక్షన్, చల్లపల్లి బంగ్లా, హనుమాన్‌పేట, ఏలూరు లాకులు, బీఆర్టీఎస్ రోడ్డు, గుణదల, రామవరప్పాడు నుంచి వెళ్లాలి.
- పీఎన్‌బీఎస్ నుంచి మచిలీపట్నం వైపు వెళ్లే బస్సులు పీసీఆర్, ఆర్టీసీ వై జంక్షన్, చల్లపల్లి బంగ్లా, విజయ టాకీస్, దీప్తి జంక్షన్, గుట్టుగుంట, మాచవరం, పడవలరేవు జంక్షన్, గుణదల, రామవరప్పాడు రింగ్, ఎనికేపాడు జంక్షన్, తాడిగడప 100 అడుగుల రోడ్డు మీదుగా వెళ్లాలి.
- బెంజ్‌సర్కిల్ నుంచి ఎంజీ రోడ్డులో వెళ్లాల్సిన ఆర్టీసీ బస్సులు మహానాడు, రామవరప్పాడు రింగ్, ఏలూరు రోడ్డు, గుణదల, చుట్టుగుంట, దీప్తి జంక్షన్, అప్సర జంక్షన్, పీసీఆర్ జంక్షన్ నుంచి వెళ్లాలి.
- ఎంజీ రోడ్డులో ఏడు గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఆటోలు, ఆర్టీసీ బస్సులను అనుమతించరు.
- బెంజ్‌సర్కిల్ నుంచి సీవీఆర్ మధ్యలో స్వర్ణాంధ్ర విజన్ కార్యక్రమానికి వచ్చే వాహనాలను తప్ప ఇతర వాహనాలను అనుమతించరు.
- సీతారామపురం జంక్షన్ నుంచి ఆర్టీఏ జంక్షన్ వరకు ఈట్‌స్ట్రీట్ వైపు స్వర్ణాంధ్ర విజన్‌కు వచ్చే వాహనాలను మాత్రమే అనుమతిస్తారు.
- శిఖామణి సెంటర్ నుంచి చుట్టుగుంట వరకు ఎలాంటి వాహనాలను అనుమతించరు.

అట్టహాసంగా వాలీబాల్ టోర్నీ ప్రారంభం

● హాజరైన ఎమ్మెల్యేలు బోడె, గద్దె



టోర్నీ ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్, గద్దె రామ్మోహన్

విజయవాడ స్పోర్ట్స్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ వాలీబాల్ టోర్నీతో విజయవాడకు క్రీడా శోభ సంతరించుకుందని ఎమ్మెల్యే బోడే ప్రసాద్ అన్నారు. వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాలలో అంతర్జాతీయ ప్రమాణాలతో నూతనంగా నిర్మాణం చేసిన ఇండోర్ స్టేడియంలో నాదెళ్ల బసవపూర్ణయ్య (ఎన్‌బీపీ) ట్రస్ట్ అఖిల భారత ఇన్విటేషన్ వాలీబాల్ మహిళల టోర్నమెంట్ గురువారం ప్రారంభించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ఈ పోటీలను ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కలిసి ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. జాతీయ పోటీలతో విజయవాడ ఖ్యాతిని దేశానికి చాటుతున్న ఎన్‌బీపీ ట్రస్ట్ ప్రతినిధులను అభినందించారు. ఎన్‌బీపీ ట్రస్ట్ చైర్మన్ నాదెళ్ల బ్రహ్మాజీరావు మాట్లాడుతూ ఎస్ఆర్ఎం వర్సిటీ, తమిళనాడు క్రీడా ప్రాధికార సంస్థ, జీఈపీఏఐఆర్ వర్సిటీ, బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర, గుజరాత్ స్పోర్ట్స్ హాస్టల్, పీకేఆర్ వర్సిటీ జట్లు లీగ్ కమ్ నాకౌట్ పద్ధతిలో ఈ నెల 15 వరకు తలపడతాయన్నారు. విజేతలకు రూ.2.75లక్షల నగదు బహుమతి, ట్రోఫీలను, మెడల్స్ అందజేస్తామన్నారు. సిద్ధార్థ విద్యాసంస్థల అధ్యక్షుడు పీ నాగేశ్వరరావు, కోశాధికారి సూరెడ్డి వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి సూరెడ్డి విష్ణు, కళాశాల ప్రిన్సిపాల్ పీ వెంకటేశ్వరరావు, అర్జున అవార్డీ అరికెపూడి రమణరావు, శాప్ డిప్యూటీ డైరెక్టర్, సీనియర్ వాలీబాల్ క్రీడాకారుడు గోపీచంద్, ఉమ్మడి కృష్ణా వాలీబాల్ సంఘం కార్యదర్శి దోనేపూడి దయాకరరావు పాల్గొన్నారు.

చదును పేరుతో కలప, గ్రావెల్ హాంఫట్!

● రాత్రి పూట అక్రమంగా తరలిస్తున్న అక్రమార్కులు ● కొరవడిన అధికారుల పర్యవేక్షణ





ట్రాక్టర్‌పై కలప తరలింపు, గ్రావెల్ తవ్వుతున్న ఎస్కవేటర్

హనుమాన్‌జంక్షన్ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మల్లవల్లి పారిశ్రామికవాడలో అక్రమార్కులకు అడ్డూ అదుపు లేకుండా పోతోంది. పారిశ్రామికవాడకు కేటాయించిన భూములను చదును చేయాల్సి ఉండగా దాన్ని అదనుగా చేసుకుని అక్రమాలకు తెరతీస్తున్నారు. భూముల్లో పెరిగిన చెట్లను తొలగించి ప్రత్యేకంగా వేలంపాట ద్వారా విక్రయించగా వచ్చిన నిధులను ఏపీఐఐసీకి వినియోగించాల్సి ఉండగా అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో ఇష్టారీతిగా అమ్ముకుంటున్నారు. ఒక ఎకరా చెట్లు తొలగిస్తే ట్రాక్టర్ కలప వస్తుందని, ఇప్పటికి సుమారు 79 ఎకరాల్లో చెట్లను తొలగించగా ఒక్కో ట్రాక్టర్ కలప రూ.6వేల వరకూ అమ్ముకుంటున్నారని స్థానికులు తెలియజేస్తున్నారు. దీంతో ఏపీఐఐసీకి లక్షల్లో నష్టం వాటిల్లినా పట్టించుకున్న నాథుడే కరువయ్యారు. అంతేకాక గత ప్రభుత్వంలో గ్రావెల్ తరలింపులో కీలకపాత్ర పోషించిన వ్యక్తి, మండల నేత కనుసన్నల్లో తిరిగి గ్రావెల్ తరలింపు ఊపందుకుంది. చదును నిమిత్తం స్థానిక వైసీపీకి చెందిన కాంట్రాక్టరే మళ్లీ పనులు దక్కించుకున్నట్టు సమాచారం. చదును పేరుతో అర్ధరాత్రి పూట గ్రావెల్‌ను అక్రమంగా తరలిస్తున్నారు. గత వారం మట్టి తరలిస్తున్నవారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నా గ్రావెల్ తరలింపు మాత్రం ఆగకపోవడం గమనార్హం. గ్రామాల్లో ఇల్లు కట్టుకునేందుకు ట్రాక్టర్‌తో మట్టి తోలుకుంటుంటే అడ్డుకునే అధికారగణం పారిశ్రామికవాడలో ఇన్ని అక్రమాలు జరుగుతున్నా అటు రెవెన్యూ అధికారులు గానీ, ఇటు ఏపీఐఐసీకి చెందిన అధికారులు గానీ అదుపు చేయలేకపోవడాన్ని ప్రజలు తీవ్రంగా ఆక్షేపిస్తున్నారు. ప్రభుత్వం మారినా ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు హెచ్చరికలు జారీ చేసినా అధికారుల అండదండలతో అక్రమ వ్యాపారం నిరాటంకంగా సాగుతోంది. ఇప్పటికైనా అధికారులు పర్యవేక్షించి అక్రమ తోలకాలు జరిపేవారిపై కఠినచర్యలు చేపట్టకపోతే అక్రమార్కులకు మరింత ఊతమిచ్చినట్లవుతుందని మల్లవల్లి గ్రామస్థులు కోరుతున్నారు.





బ్యాటింగ్ చేస్తున్న డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్, క్రీడాకారులు, క్రికెట్ ట్రోఫీతో డీఆర్ఎం

8వ డీఆర్ఎం కప్ క్రికెట్ పోటీలు ప్రారంభం

రైల్వేస్టేషన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విజయవాడ రైల్వే మినీ స్టేడియంలో గురువారం 8వ డివిజనల్ రైల్వే మేనేజర్ కప్ అంతర్ శాఖల క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభమైంది. ఈ నెల 20 వరకు కొనసాగనుంది. టోర్నమెంట్‌ను డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ ప్రారంభించారు. బ్యాటింగ్, బౌలింగ్ చేసి ఆకట్టుకున్నారు. టోర్నమెంట్‌లో మొత్తం 15 శాఖలు పాల్గొననున్నాయి. లీగ్ మ్యాచ్‌లలో క్రికెటర్లు తమ నైపుణ్యాన్ని ప్రదర్శించనున్నారు. 20 ఓవర్ల వైట్‌బాల్ ఫార్మాట్‌లో మ్యాచ్‌లు జరగనున్నాయి. ఈ మ్యాచ్‌లలో గెలిచిన జట్లకు జోనల్, జాతీయ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. డివిజనల్ స్పోర్ట్స్ ఆఫీసర్ వాలేశ్వర బీ తోకల స్వాగత ప్రసంగం చేశారు. డీఆర్ఎం నరేంద్ర ఏ పాటిల్ మాట్లాడుతూ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రైల్వే స్టేషన్ బ్రాంచ్ అధికారులకు ఆయన ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలుపుతూ టోర్నమెంట్‌కు స్పాన్సర్ చేసినందుకు అభినందనలు తెలిపారు. సౌత్ సెంట్రల్ రైల్వే స్పోర్ట్స్ అసోసియేషన్ మ్యాచ్ నిర్వహణకు తగు ఏర్పాట్లు చేసినందుకు కొనియాడారు. యువతలోని నైపుణ్యాలను వెలికితీసేందుకు ఇటువంటి టోర్నమెంట్‌లు వేదికలుగా ఉపయోగపడతాయన్నారు. అనంతరం నరేంద్ర ఏ పాటిల్, బ్రాంచ్ ఆఫీసర్లు ఆటగాళ్లకు 4 క్రికెటింగ్ కిట్లు, మెమెంటోలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ట్రోఫీతో ఆయన క్రీడాకారులతో కలిసి గ్రూప్ ఫొటో దిగారు. డీఆర్ఎం, బ్రాంచి ఆఫీసర్లు రెండు ఓవర్ల స్నేహపూర్వక ఎగ్జిబిషన్ మ్యాచ్‌ను ఆడారు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ - డీజిల్ లోకో షెడ్ మొదటి రోజున తలపడ్డాయి. సీనియర్ డీఈఎన్ ఎస్.వరుణబాబు, సీనియర్ డీఎంఈ సంజయ్ అంగోతు, ఎఎస్ఈ జి.మధుసూదనరావు, బ్రాంచి అధికారులు, ఇన్స్పెక్టర్లు పాల్గొన్నారు.




న్యాయవాదుల సమస్యలపై బార్ కౌన్సిల్ కార్యదర్శికి వినతిపత్రం సమర్పిస్తున్న కృష్ణా, గుంటూరు జిల్లాల బార్ ఫెడరేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించండి

● బార్ కౌన్సిల్ కార్యదర్శికి వినతిపత్రం

విజయవాడ లీగల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కృష్ణాజిల్లా బార్ ఫెడరేషన్, గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ న్యాయవాదులంతా కలిసి గురువారం హైకోర్టు ఆవరణలోని బార్ కౌన్సిల్ సెక్రటరీకి న్యాయవాదుల సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. కృష్ణాజిల్లా బార్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా విజయవాడ బార్ ప్రెసిడెంట్ కొత్త చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శిగా మచిలీపట్నం బార్ అధ్యక్షుడు బూరగడ్డ అశోక్‌కుమార్, కార్యదర్శిగా బెజవాడ బార్ ప్రధాన కార్యదర్శి అరిగెల శివరాంప్రసాద్ (రాజా), ఉపాధ్యక్షులుగా జగ్గయ్యపేట బార్ అధ్యక్షుడు సుందరరావు, గుంటూరు జిల్లా బార్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా కాసు వెంకటరెడ్డి నియామకాన్ని అందరూ హర్షించారు.



అడ్మిషన్ల నోటిఫికేషన్ విడుదల చేస్తున్న యూనివర్సిటీ యాజమాన్యం

వీఆర్ సిద్ధార్థ కళాశాలలో వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు ఆహ్వానం

పెనమలూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కానూరులోని వీఆర్ సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల (డీమ్డ్ టుబీ యూనివర్సిటీ) వచ్చే విద్యా సంవత్సరానికి వివిధ కోర్సుల్లో ప్రవేశానికి అడ్మిషన్ నోటిఫికేషన్ విడుదల చేసింది. స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్, మేనేజిమెంట్, సైన్సెస్, ఆర్ట్స్ అండ్ కామర్స్, స్కూల్ ఆఫ్ లా కోర్సుల్లో ప్రవేశాలకు గురువారం ప్రకటన విడుదల చేసింది. గ్యాడ్యుయేట్ ప్రోగ్రామ్స్‌తో పాటు, పోస్ట్ గ్రాడ్యుయేట్ ప్రోగ్రాములు, పీహెచ్‌డీ ప్రోగాముల్లో ప్రవేశాలు నిర్వహించనున్నట్లు వర్సిటీ యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. ఆయా కోర్సుల్లో ప్రవేశానికి విద్యార్థుల వ్యక్తిగత ప్రతిభతోపాటు వర్సిటీ స్కూల్స్ నిర్వహించే పరీక్షలు, రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో ప్రతిభను నిరూపించుకోవాల్సి ఉంటుందన్నారు. ప్రతిభ గల 30 శాతం విద్యార్థులకు రూ.3కోట్ల విలువైన స్కాలర్‌షిప్‌లు అందిస్తారన్నారు. అడ్మిషన్ల వివరాలకు కళాశాల డీన్‌ను సంప్రదించాలని కోరారు.

భవానీలకు ఇబ్బందులు కలిగించొద్దు

● కలశజ్యోతి ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించిన ఈవో రామారావు







కలశజ్యోతి ఉత్సవ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈవో రామారావు, కళావేదికపై కళాకారుల కూచిపూడి నృత్య ప్రదర్శన, మేజర్ రాంగోపాల్ నాయుడుకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

వన్‌టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కలశజ్యోతి ఉత్సవంలో పాల్గొనటానికి వచ్చే భవానీలకు ఎలాంటి ఇబ్బందులు కలిగించవద్దని దుర్గగుడి ఈవో కె.ఎస్.రామారావు అధికారులను ఆదేశించారు. భవానీ దీక్షల విరమణలను పురస్కరించుకుని ఈనెల 14న దేవస్థానం ఆధ్వర్యంలో కలశజ్యోతి ఉత్సవం జరగనుంది. ఆరోజు సాయంత్రం 5 గంటలకు సత్యనారాయణపురం రామకోటి మైదానం నుంచి పెద్ద ఎత్తున భవానీలు కలశ జ్యోతులతో ఊరేగింపు దేవస్థానం వరకు నిర్వహించనున్నారు. ఘాట్‌రోడ్డులో ఓం టర్నింగ్ వద్ద కలశజ్యోతులను పెట్టి అమ్మవారిని దర్శించుకోనున్నారు. దేవస్థానానికి వచ్చే భవానీలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఈవో గురువారం కొండపైన, దిగువన కనకదుర్గనగర్ ప్రాంతాలను పరిశీలించారు. ఆరోజున కనకదుర్గనగర్‌లో వాహనాలను లోపలికి రానీయకుండా నిలిపేయాలని, భవానీల రాకపోకలకు అంతరాయం లేకుండా భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

దుర్గగుడి మహామండపం 7వ అంతస్తు, కళావేదికపై గొల్లపూడికి చెందిన నాట్యాంజలి కూచిపూడి నృత్యాలయం ఆధ్వర్యంలో గురువారం జరిగిన కూచిపూడి నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకుంది. గురువులు మాగులూరి త్రినాథచారి పర్యవేక్షణలో జరిగిన నృత్య ప్రదర్శనలో మూషిక వాహన, ఆనంద తాండవం, శివతాండవ స్తోత్రం, కామాక్షి స్తుతి, కొండలలో నెలకొన్న కొలువైన రంగశాయి, ఇంకా పలు కీర్తనలకు నృత్య ప్రదర్శన చేశారు. అనంతరం అధికారులు కళాకారులను అభినందించి ప్రశంసా పత్రం, ప్రసాదం అందజేశారు.

దుర్గమ్మ సన్నిధిలో కీర్తిచక్ర అవార్డు గ్రహీత

ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను కీర్తిచక్ర అవార్డు గ్రహీత మేజర్ రాంగోపాల్ నాయుడు కుటుంబ సభ్యులతో కలిసి గురువారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అధికారులు వారికి అమ్మవారి దర్శనం చేయించి వేద ఆశీర్వచనం అందజేశారు. అనంతరం దేవస్థానం ఈవో కేఎస్ రామారావు ఆయనకు అమ్మవారి చిత్రపటం, శేషవస్త్రం, లడ్డూ ప్రసాదం అందజేశారు.

స్టెల్లాలో బాస్కెట్‌బాల్ టోర్నీ ప్రారంభం





బాస్కెట్ బాల్ పోటీలో తలపడుతున్న క్రీడాకారులు, మూడోస్థానంలో నిలిచిన సిద్ధార్థ మహిళా కళాశాల

పటమట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మారిస్ స్టెల్లా కళాశాలలో కృష్ణా వర్సిటీ, స్టెల్లా కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో గురువారం కాల్కెజియాట్ బాస్కెట్ బాల్ టోర్నీని కళాశాల కరస్పాండెంట్ డాక్టర్ లేన క్వాడ్రస్, ప్రిన్సిపాల్ డాక్టర్ జసింతా క్వాడ్రస్‌లు పద్మజ సుజుకి సీఈవో అనురాధ, బాస్కెట్ బాల్ ఫెడరేషన్ ప్రెసిడెంట్ జీ బోజ్, విజయవాడ జేవియర్ బోర్డు పూర్వపు డైరెక్టర్ ఫాదర్ ధన్‌పాల్ ప్రారంభించారు. క్రీడలు మానసిక ఉల్లాసానికి, శారీరక ధారుఢ్యానికి దోహదపడతాయని, కీడల్లో మంచి ప్రావీణ్యం సాధించి మెరుగైన ఫలితాలు పొందటమే కాకుండా, ఉద్యోగావకాశాలు అందిపుచ్చుకోవాలని తెలిపారు. పోటీల్లో నగరంలోని పలు కళాశాలలు క్రీడాకారులు, కోచ్‌లు, మేనేజర్లు 7 టీమ్‌లు, కోచ్ రాజా, వ్యాయామ ఉపాధ్యాయురాలు సునీత, మౌనిక పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్‌లో సిద్ధార్థ మహిళా జట్టుకు మూడో స్థానం

విజయవాడ స్పోర్ట్స్: మారిస్ స్టెల్లా కళాశాలలో గురువారం జరిగిన కృష్ణా వర్సిటీ బాస్కెట్‌బాల్ టోర్నీలో సిద్ధార్థ మహిళా కళాశాల జట్టు మూడోస్థానంలో నిలిచిందని ఎస్‌డీఎం కళాశాల ప్రిన్సిపాల్ కల్పన తెలిపారు. ఇద్దరు బాలికలు త్వరలో జరిగే పోటీలకు సౌత్‌జోన్ టీమ్‌కు ఎంపికయ్యారని వివరించారు. ఈ టోర్నీలో ప్రథమస్థానంలో స్టెల్లా కళాశాల నిలవగా, ఆంధ్ర లయోలా కళాశాలలో రెండోస్థానంలో నిలిచాయి.

రేపు విజయవాడలో మెగా జాబ్‌మేళా

● నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యం
● ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

గన్నవరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అడుగులు ముందుకు వేశారు. ఎన్నికల సమయంలో నియోజకవర్గంలోని 15వేల మందికి పైగా ఉద్యోగాలు కల్పిస్తానని హామీ ఇచ్చారు. అందులో భాగంగా ఈ నెల 14న మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నారు. హెచ్‌సీఎల్ సంస్థతో ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడి జాబ్ మేళాకు వచ్చేలా చేశారు. అందులో సుమారు వందకు పైగా ఉద్యోగాలు రానున్నాయి. అలాగే మరికొన్ని ప్రముఖ కంపెనీలు కూడా రానున్నాయి. ఇందులో సుమారు 5వేల మందికి ఉపాధి కల్పించనున్నారు. 7వ తరగతి నుంచి డిగ్రీ, బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎంసీఎస్, డిప్లొమో, ఫార్మసీ, నర్సింగ్, హోటల్ మేనేజ్‌మెంట్, పోస్ట్ గ్రాడ్యుయేట్, పూర్తి చేసిన 18 ఏళ్ల నుంచి 35 ఏళ్ల వరకూ జాబ్ మేళాలో పాల్గొనవచ్చు.

జాబ్‌మేళాకు వచ్చే కంపెనీలు ఇవే..

ఎనికేపాడు శక్తి కళ్యాణమండపం రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో ఈ మెగా జాబ్ మేళా జరగనుంది. హెచ్‌సీఎల్, ఇండిగో ఎయిర్ లైన్స్, హెచ్‌డీఎఫ్‌సీ, కొటక్, శ్రీరామ్, బ్యాంక్ జోన్, అపోలో, అరోరే, వరుణ్ మోటార్స్, ఎంపవర్‌మెంట్, కాసా ఆటో గ్రూప్, రిలయన్స్, ఎస్‌వీఎల్ మ్యాన్‌పవర్ సొల్యూషన్స్, మెడ్‌ప్లస్, అరోబిందో, పేటీఎం, నవత, విజేత, ట్రెంట్, స్టాఫింగ్ టైటాన్స్, యత్వ వంటి 50కిపైగా ప్రముఖ సంస్థలు ఎంపికలు నిర్వహించనున్నాయి. అర్హతను బట్టి ఇంటర్వ్యూ నిర్వహించి జాబ్ ఇవ్వనున్నారు.

15వేల మందికి ఉపాధి కల్పిస్తా: యార్లగడ్డ



నియోజకవర్గంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పిస్తానని ఎన్నికల్లో హామీ ఇచ్చా. 15వేల మందికిపైగా ఉపాధి కల్పించటంలో ఎలాంటి సందేహం లేదు. ఐటీ మంత్రి నారా లోకేష్ సహకారం పూర్తిగా ఉంది. మల్లవల్లి కారిడార్‌కు పునర్జీవం పోశాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మూసివేసిన కంపెనీల యాజమాన్యులతో మాట్లాడగా సానుకూలంగా స్పందించారు. ప్రముఖ సంస్థ అశోక్ లేల్యాండ్ పునః ప్రారంభం కానుంది. హెచ్‌సీఎల్ సంస్థతో మాట్లాడగా జాబ్ మేళాకు అంగీకరించారు. 14న నిర్వహించే జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలి.

బ్రాయిలర్ ధరలు	
అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	98, 106, 117
చికెన్ విత్ స్కిన్	188
చికెన్ స్కిన్‌లెస్	198
సెక్ కోడిగుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.630	

సెమీ క్రిస్మస్ వేడుకలు

తోట్లవల్లూరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తోట్లవల్లూరు దైవ స్వరూపి చర్చి వద్ద సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. దైవస్వరూపి సహవాసం బిషప్ దేవరపల్లి దానియేలు కేక్‌ను కట్ చేసి క్రిస్మస్ సందేశాన్ని అందించారు. చిన్నారులు క్రీస్తు పాటలకు నృత్యాలు చేసి అలరించారు. క్రిస్మస్‌కు స్వాగతం పలుకుతూ క్యాండిల్ ప్రదర్శన నిర్వహించారు. సంఘ పాస్టర్లు వల్లూరు సలోమాన్, వల్లూరు షాలేం పాల్గొన్నారు.



విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

● ఎస్ఎఫ్ఐ డిమాండ్

గుడివాడ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : విద్యారంగ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, కృష్ణా విశ్వవిద్యాలయ వసతి గృహాన్ని త్వరితగతిన పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తేవాలని, కార్పొరేట్ విద్యావిధానాన్ని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.సమరం డిమాండ్ చేశారు. గురువారం సుందరయ్యభవన్‌లో ఎస్ఎఫ్ఐ నాయకుడు నాగేంద్ర అధ్యక్షతన మండల మహాసభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా జిల్లా కార్యదర్శి సమరం, జిల్లా ఉపాధ్యక్షులు సలీమ్, జిల్లా మహిళ విభాగ కన్వీనర్ హారిక, జిల్లా కమిటీ సభ్యులు మౌనిక, సీపీఎం మండల కార్యదర్శి ఆర్సీపీ రెడ్డి హాజరయ్యారు. 6 తీర్మానాలను మహాసభలో ఆమోదించారు. అనంతరం కార్యవర్గ ఎన్నిక జరిగింది. మండల అధ్యక్ష, కార్యదర్శులుగా డి.పండు, టి.నాగేంద్ర, ఉపాధ్యక్షులుగా జోషిబాబు, జి.కౌశిక్, ఎం.ప్రేమ్‌చంద్, సహాయ కార్యదర్శులుగా శైలుష, చిన్ను, ప్రవీణ్, సత్తార్, మరో 9 మంది ఆఫీస్ బేరర్లుగా ఎన్నికయ్యారు. నూతన కమిటీని పలువురు అభినందించారు.

జగనన్న కాలనీలో రోడ్లు నిర్మించండి

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు కాలనీవాసుల వినతి

గుడ్లవల్లేరు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కాలనీలో 300కు పైగా ఇళ్లున్నా ఒక్క రహదారి కూడా నడిచేందుకు వీలుగా లేదని, వర్షం కురిస్తే మోకాళ్ల లోతు నీటిలో నడుస్తున్నామని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము వద్ద గుడ్లవల్లేరు జగనన్న కాలనీవాసులు ఏకరవుపెట్టారు. గురువారం గుడ్లవల్లేరు చంద్రన్న కాలనీ, జగనన్న కాలనీలకు వెళ్లేందుకు రహదారులు నిర్మించాలని ఎమ్మెల్యేను టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి కోరి, ఆ ప్రాంతానికి ఎమ్మెల్యేను తీసుకెళ్లారు. కాలనీకి వెళ్లేందుకు సరైన మార్గం లేదని రైల్వేగేట్ పక్కన ఉన్న డొంకనే మార్గంగా వాడుకుంటున్నామని అక్కడి మహిళలు ఎమ్మెల్యేకు తెలిపారు. కాలనీలో ప్రధాన, అంతర్గత రహదారులు నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. అంతర్గత రహదారులు నిర్మించేందుకు నిధులు సమకూర్చే మార్గాలను అన్వేషిస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. ప్రధాన రహదారి రానున్న వర్షాకాలంలోపు పూర్తి చేయిస్తానని రాము హామీ ఇచ్చారు.



ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తున్న జగనన్న కాలనీ మహిళలు

రైల్వేగేట్ వద్ద నుంచి రెండు కాలనీలకు ప్రధాన మార్గం నిర్మించేందుకు ప్రతిపాదిత మ్యాప్‌ను తహసీల్దార్ లోకరాజు చూపించారు. మార్గంలో కొంత ప్రైవేట్, రైల్వే పంచాయతీ స్థలం ఉందని అధికారులు, స్థానిక పెద్దలు ఎమ్మెల్యేకు వివరించారు. రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఎమ్మెల్యే సూచించారు. వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, వల్లభనేని వెంకట్రావు, చాపరాల బాలాజీ, వల్లభనేని సుబ్బారావుచౌదరి, పోలవరపు వెంకటరావు, బొప్పన శ్రీను, యెనిగళ్ల నాగేశ్వరరావు, వీఆర్వో ప్రకాష్ పాల్గొన్నారు.

పది సీసీ రోడ్లు ప్రారంభం

పల్లెపండుగలో భాగంగా ఎస్ఆర్ఈజీఎస్ నిధులు రూ.75 లక్షలతో గుడ్లవల్లేరులో నిర్మించిన పది సీసీ రోడ్లను ఎమ్మెల్యే వెనిగండ్ల రాము గురువారం ప్రారంభించారు. 40 ఏళ్లుగా లేని రహదారిని కూటమి ప్రభుత్వం నిర్మించి చూపిందంటూ ఎమ్మెల్యే వెనిగండ్ల రామును సింగలూరు కాల్వగట్టు ప్రజలు అభినందనలతో ముంచెత్తారు. సంత సమీపంలో ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని రాము ఆవిష్కరించారు. వేర్‌హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ రావి వెంకటేశ్వరరావు, జనసేన గుడివాడ నియోజకవర్గ ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దావులూరి సురేంద్రబాబు పాల్గొన్నారు.



నెహ్రూచౌక్‌లో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలి

గుడివాడ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): చంద్రబాబు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైసీపీ ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచిందని గగ్గోలు పెట్టారని, ముఖ్యమంత్రి అయ్యాక గతంలో ఉన్న దానికంటే చార్జీలను రెట్టింపుగా పెంచారని సీపీఎం మండల కార్యదర్శి ఆర్సీపీ రెడ్డి విమర్శించారు. గురువారం నెహ్రూచౌక్ సెంటర్‌లో పెంచిన విద్యుత్ చార్జీలు తగ్గించాలంటూ సీపీఎం నాయకులు నిరసన తెలిపారు. అదానీతో చేసుకున్న విద్యుత్ ఒప్పందాలను ప్రభుత్వం రద్దు చేయాలని ఆర్సీపీ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యుత్ చార్జీలు తగ్గించే వరకు పోరాటం ఆగదన్నారు. సింగవరపు రాంబాబు, అలూరు విజయకుమార్, లంకా సురేంద్ర, పి.రజిని, వెంకటేష్ పాల్గొన్నారు.

పేద విద్యార్థినికి ఆర్థిక సాయం

గుడివాడ: ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న పేద విద్యార్థిని ఎస్.నవ్య కళాశాల ఫీజు నిమిత్తం రూ.21,000 రోటరీ క్లబ్ అందజేసింది. గురువారం రోటరీ భవన్‌లో క్లబ్ వారాంతపు సమావేశంలో విద్యార్థిని తల్లి ఎస్.జ్యోతికి బేసిక్ ఎడ్యుకేషన్ అండ్ లిటరసీ చైర్మన్ కె.వెంకటేశ్వరరావు నగదు అందించారు. నవ్యకు తండ్రి లేకపోవడంతో పరీక్ష, కళాశాల ఫీజు చెల్లించలేకపోవడంతో క్లబ్‌ను సంప్రదించారు. దీంతో ఆర్థిక సాయం చేశామని క్లబ్ అధ్యక్షుడు టి.ఎస్.రాజశేఖర్ తెలిపారు.

రాజకీయ ఒత్తిళ్లకు లొంగొద్దు

● సాగునీటి సంఘాల ఎన్నికలు సక్రమంగా నిర్వహించండి
● సిబ్బందికి తహసీల్దార్ రామకోటేశ్వరరావు సూచన



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ రామకోటేశ్వరరావు

గుడివాడ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా సాగునీటి సంఘాల ఎన్నికలు సక్రమంగా నిర్వహించాలని అధికారులు, సిబ్బందికి తహసీల్దార్ రామకోటేశ్వరరావు సూచించారు. ఈనెల 14న మండలంలో 8 సాగునీటి సంఘాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నందున గురువారం ఎన్జీవో హోంలో ఎన్నికల్లో పాల్గొనే సిబ్బందికి ఆయన శిక్షణ ఇచ్చారు. పోలింగ్ బూత్‌లోకి ప్రవేశించాక ప్రభుత్వ నిబంధనల ప్రకారమే నడుచుకోవాలని సిబ్బందికి సూచించారు. ఎంపీడీవో డి.వై. విష్ణుప్రసాద్, ఆర్ఐ నాగబాబు పాల్గొన్నారు.

రేపు 11 సాగునీటి సంఘాల ఎన్నికలు

కూచిపూడి: మొవ్వ మండలంలోని 11 నీటి వినియోగదారుల సంఘాలకు ఈనెల 14న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తున్న తహసీల్దార్ కె.మస్తాన్ తెలిపారు. ఎన్నికల నోటిఫికేషన్‌ను పంచాయతీ కార్యదర్శులు, గ్రామ రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యాలయాల్లో విడుదల చేశారు. 150-బార్లపూడి సంఘానికి, 153-మొవ్వ సంఘానికి ఎన్నికలు మొవ్వ జడ్పీపాఠశాల, 154-భట్లపెనుమర్రు నీటి వినియోగదారుల సంఘ ఎన్నికలు ఆ గ్రామ జడ్పీ పాఠశాల, 155-పెదసనగల్లు నీటి వినియోగదారుల సంఘానికి పెదసనగల్లు హైస్కూల్, 156-పెదముత్తేవి సంఘానికి ఆ గ్రామ జడ్పీ పాఠశాల, 157-కోసూరు సంఘానికి కోసూరు హైస్కూల్, 160-అయ్యంకి సంఘానికి ఆ గ్రామంలోని ఎంపీ ఎలిమెంటరీ పాఠశాల, 163-నిమ్మకూరు సంఘానికి నిమ్మకూరులో, 164 మంత్రిపాలెం సంఘానికి ఆ గ్రామంలోని యూపీ పాఠశాల, 165 కాజ సంఘానికి కాజ జడ్పీ పాఠశాల, నిడుమోలు సంఘానికి నిడుమోలు హైస్కూల్‌లో ఎన్నికలు జరుగుతాయని ఎన్నికల అధికారి మస్తాన్ తెలిపారు.



కూచిపూడిలో నోటిఫికేషన్ విడుదల చేస్తున్న అధికారులు

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి



మొవ్వ మండలం భట్లపెనుమర్రులో అర్జీలు అందిస్తున్న రైతులు

గుడివాడ రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను పరిష్కరించటానికి ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ రామకోటేశ్వరరావు సూచించారు. గురువారం రామన్నపూడిలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. పట్టాదారు పాసు పుస్తకాలు, అడంగల్ సమస్యలు పరిష్కరించటానికి సిద్ధంగా రెవెన్యూ సిబ్బంది సిద్ధంగా ఉన్నారని ఆయన తెలిపారు. మండల ప్రత్యేకాధికారి సాల్మన్ రాజు, ఆర్ఐ నాగబాబు, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

భట్లపెనుమర్రులో 44 అర్జీలు

కూచిపూడి: భట్లపెనుమర్రులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 44 అర్జీలు అందాయని అధికారులు తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకాలు, సర్వే నిర్వహించటం, అడంగల్‌లో పేర్లు నమోదు తదితర సమస్యలు పరిష్కరించాలని అర్జీలు వచ్చాయని తెలిపారు. అనంతరం పెదసనగల్లులో నిర్వహించిన సదసుసలో ఐదు అర్జీలు అందాయన్నారు. ప్రత్యేకాధికారి డి.విజయవర్ధన్‌రావు, తహసీల్దార్ మస్తాన్, రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ జగన్మోహనరావు, ఆర్ఐ విజయదుర్గ, వీఆర్వో కేపీ నెహ్రూ, సర్పంచ్‌లు మట్టా ఇందిర, కైతేపల్లి అన్నామణి పాల్గొన్నారు.

మంటాడలో 16..

పమిడిముక్కల: మంటాడ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూమి, ఇతర సమస్యల పరిష్కారం కోసం రైతులు, గ్రామస్థుల నుంచి 16అర్జీలు స్వీకరించినట్టు తహసీల్దార్ కె.నవీన్ కుమార్ తెలిపారు. సర్వేయర్ కిరణ్‌కుమార్, సర్పంచ్ ఎన్.వీరమ్మ, ఉద్యోగులు పాల్గొన్నారు.

జువ్వనపూడిలో 9..

పెదపారుపూడి: జువ్వనూడి పంచాయతీ కార్యాలయంలో భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి 9 అర్జీలు స్వీకరించామని తహసీల్దార్ రంగారావు తెలిపారు.

కనుమూరులో ఐదు..

పామర్రు: కనుమూరులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూసమస్యలపై ఐదు అర్జీలను అందజేసినట్టు తహసీల్దార్ జి.రవికాంత్ తెలిపారు. సదస్సులో రీసర్వే డీటీ వి.గంగాధరరావు, ఆర్ఐ రాము పాల్గొన్నారు.

గౌరీశంకరస్వామి దేవస్థానం హుండీ ఆదాయం రూ.3.82లక్షలు

గుడివాడ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గౌరీశంకరపురంలోని గౌరీశంకరస్వామి దేవస్థానానికి 20 రోజులకు హుండీ లెక్కింపు ద్వారా రూ.3,82,163 ఆదాయం సమకూరిందని ఆలయ ఈవో కె.వి.గోపాలరావు తెలిపారు. గురువారం దేవస్థానం ఆవరణలో దేవదాయశాఖ గుడివాడ ఇన్‌స్పెక్టర్ వి.సుధాకర్ పర్యవేక్షణలో భక్తుల సమక్షంలో హుండీ లెక్కించామని తెలిపారు.







మాలల మహా గర్జన పోస్టర్ ఆవిష్కరణ

15న 'మాలల మహాగర్జన'

విజయవంతానికి జేఏసీ చైర్మన్ దేవీప్రసాద్ పిలుపు

పామర్రు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 15న గుంటూరు నల్లపాడు రోడ్డులోని హౌసింగ్ బోర్డు కాలనీలో నిర్వహించే మాలల మహాగర్జన సభను విజయవంతం చేయాలని అఖిల భారత మాల సంఘాల జేఏసీ చైర్మన్, విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి ఉప్పులేటి దేవిప్రసాద్ పిలుపునిచ్చారు. స్థానికంగా ఉన్న తన కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ ఆలోచనను వెనక్కి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో సుప్రీంకోర్టు వర్గీకరణ చెల్లదని తీర్పునిచ్చిందన్నారు. వర్గీకరణకు చట్టబద్ధత లేదన్నారు. మాలలకు నష్టం కలిగే ఎస్సీ వర్గీకరణకు అంగీకరించేదిలేదని ఆయన స్పష్టంచేశారు. మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పంతగాని రమేష్ పాల్గొన్నారు.

రేపటి నుంచి పైడమ్మ జాతర

పెడన, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పైడమ్మ జాతర ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. 11 రోజుల పాటు ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. ఈనెల 24తోముగుస్తాయి. శిడిబండ్లు ప్రత్యేక ప్రభల ఊరేగింపులు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఆలయ ఈవో టి.వి.వి.మోహనరావు, వ్యవస్థాపక ధర్మకర్త తోట రామారావు, ఉత్సవ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఉత్సవాల నిర్వహణకుఏర్పాట్లు పూర్తయ్యాయి.



15న ఐక్య క్రిస్మస్ వేడుకలు

మచిలీపట్నం టౌన్: ఐక్య క్రిస్మస్ వేడుకలను ఈనెల 15న నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా జిల్లా కోర్టు సెంటర్ నుంచి కోనేరుసెంటర్ వరకు ర్యాలీ నిర్వహిస్తామని విజయవంతం చేయాలని క్రైస్తవులకు ఏఐసీసీ ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు, బెరాకా మినిస్ట్రీస్ ఫౌండర్ బ్రదర్ కిరణ్‌పాల్ పిలుపునిచ్చారు. హైనీ చర్చిలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేడుకల్లో అంతర్జాతీయ ప్రసంగీకుడు డాక్టర్ జాన్‌వెస్లీ ప్రసంగిస్తారన్నారు.

వ్యాపారం ప్రారంభించే యువతకు ఆర్థిక సహకారం

గుడివాడ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సృజనాత్మక ఆలోచనలున్న యువత వ్యాపారం ప్రారంభించడానికి రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్, జిల్లా ఇండస్ట్రీ కార్పొరేషన్, నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డు)తో పాటు అనేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ సంస్థలు ఆర్థిక సహకారం అందిస్తున్నాయని, యువత వాటిని సద్వినియోగం చేసుకుని వ్యాపార రంగంలో ప్రవేశించి, వినూత్న ఆలోచనలతో వ్యాపారాన్ని వృద్ధి చేసి, రాష్ట్ర అభివృద్ధికి సహాయపడాలని గుడ్లవల్లేరు ఇంజినీరింగ్ కళాశాల బిజినెస్ అండ్ మేనేజ్‌మెంట్ విభాగాధిపతి డాక్టర్ జి.కమల్ సూచించారు. గురువారం అక్కినేని నాగేశ్వరరావు కళాశాలలో ఎంబీఏ విభాగం, ఎంట్రప్రెన్యూర్ సెల్ ఆధ్వర్యంలో 'స్టార్టప్ ఫండింగ్ ఎస్సెన్షియల్స్- ఫ్రంబూట్ స్ట్రాపింగ్ టూ వెంచర్ కాపిటల్' అనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సుకు ముఖ్య అతిథిగా డాక్టర్ కమల్ విచ్చేశారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు ఎల్ఆర్‌కె ప్రసాద్, కేఎస్ అప్పారావు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జె.ఎస్.కుమార్, వైస్‌ప్రిన్సిపాల్ బి.పద్మజ, ఎంబీఏ విభాగాదిపతి డాక్టర్ సువర్చల, ఎంట్రప్రెన్యూర్ సెల్ విభాగాధిపతిఎం.భరత్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి చేయండి

● డీఈవో రామారావు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి విద్యార్థులు నూరుశాతం సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో పి.వి.జె.రామారావు సూచించారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు రూపొందించిన మోడల్ టెస్టు పేపర్లను గురువారం డీఈవో ఆవిష్కరించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులకు ఈ మోడల్ పేపర్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. యూటీఎఫ్ నాయకులు ఎండీ హుస్సేన్, శేషారావు, కె.ఉమామహేశ్వరరావు, కె.లెనిన్‌బాబు, జె.ప్రసాదరావు పాల్గొన్నారు.

బుడమేరు బాధితులకు పరిహారం చెల్లించాలి

గుడివాడ: గన్నవరం నియోజకవర్గంలోని ముక్కపాడు, లంకపల్లి, ఎలుకపాడు, వెల్దిపాడుల్లో బుడమేరు వరదల్లో నీటమునిగిన ఇళ్లకు ఇప్పటికీ నష్టపరిహారం చెల్లించలేదని, ఆయిల్ ఇంజన్లు, విద్యుత్ మోటార్లు మరమ్మతులకు కూడా నష్టపరిహారం అందించాలని సీపీఎం ఉంగుటూరు మండల కమిటీ కార్యదర్శి అజ్మీర వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. లంకపల్లి, ముక్కపాడు జాబితాను కలెక్టర్ కార్యాలయానికి పంపామన్నారు.







ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్)
కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 09737, 99854 11610

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ క్రింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	98, 106, 117
చికెన్ విత్ స్కిన్	188
చికెన్ స్కిన్‌లెస్	198

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ.630

నేటి నుంచి సుబ్రహ్మణ్య ప్రతిష్ఠా మహోత్సవాలు

చల్లపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాగోలులోని కైవల్యాశ్రమంలో ఈనెల 13వ తేదీ నుంచి సుబ్రహ్మణ్య ప్రతిష్ఠా మహోత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆశ్రమ వ్యవస్థాపకుడు మేకా బంగారుబాబు తెలిపారు. ఉదయం 8గంటల నుంచి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, పరిషత్ ప్రాయశ్చిత్తం, పంచగవ్యప్రాసన, దీక్షా ధారణ, రిత్విక్ వరుణం, అఖండ స్థాపన, అంకురారోపణ, వాస్తుమండల ఆరాధన, క్షేత్రపాలక, నవగ్రహ, చతుష్షష్టి యోగిని సర్వతోభద్ర మండప ఆవాహన, అగ్నిప్రతిష్ఠాపన, సుబ్రహ్మణ్య మూలమంత్ర హవనం, క్షీరాధి, జలాధి, ధాన్యాధి, శయ్యాధి, పుష్పాధివాసాలు, 14న గర్తన్యాసం, రత్నన్యాసం, బీజన్యాసం, ఉదయం 8.06 గంటలకు సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన, పూర్ణాహుతి, అవభృదం నిర్వహిస్తామని తెలిపారు.



రేపటి నుంచి పైడమ్మ జాతర

పెడన, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పైడమ్మ జాతర ఉత్సవాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. 11 రోజుల పాటు ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించాక, ఈనెల 24తో ముగుస్తాయి. శిడిబండ్లు ప్రత్యేక ప్రభల ఊరేగింపులు ఉత్సవాలకు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఆలయ ఈవో టి.వి.వి.మోహనరావు, వ్యవస్థాపక ధర్మకర్త తోట రామారావు, ఉత్సవ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో ఉత్సవాల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.



బంటుమిల్లిలో సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న డీఎస్పీ అబ్దుల్ సుభాన్

15 సీసీ కెమెరాల ఏర్పాటు

బంటుమిల్లి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): నేరాల నియంత్రణకు, సమగ్ర భద్రత కోసం బంటుమిల్లిలో దాతల సహకారంతో ఏర్పాటు చేసిన 15 సీసీ కెమెరాలను డీఎస్పీ అబ్దుల్ సుభాన్ గురువారం ప్రారంభించారు. పాఠశాలలు, కాలేజీలు, ప్రధాన రహదారులు, కూడళ్లు, ప్రార్థనా మందిరాలు, ప్రధానమైన గ్రామాలను అనుసంధానిస్తూ కెమెరాలను ఏర్పాటు చేసి, వాటిని పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానించారు. సీఐ కె.నాగేంద్రప్రసాద్, ఎస్సై గణేష్ పాల్గొన్నారు.



శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్న కేయూ వీసీ ఆర్.శ్రీనివాసరావు

కేయూ బోధనేతర సిబ్బందికి
కంప్యూటర్ శిక్షణ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కృష్ణా విశ్వవిద్యాలయంలో బోధనేతర సిబ్బంది అందరికీ కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలని కేయూ వీసీ ఆర్.శ్రీనివాసరావు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా బోధనేతర సిబ్బందికి నిర్వహిస్తున్న కంప్యూటర్ శిక్షణ తరగతులు గురువారం ముగిశాయి. కంప్యూటర్ సైన్స్ డీన్ సుందరకృష్ణ, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి తదితరులు పర్యవేక్షించారు.

హడావుడిగా వరికుప్పలు
అమాంతం పెరిగిన కూలిరేట్లు

మోపిదేవి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వాతావరణంలో మార్పులు చోటుచేసుకోవడం, అల్పపీడన ప్రభావంతో వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో వరికోతలు కోసిన రైతులు హడావుడిగా కుప్పలు వేస్తున్నారు. రైతులు ఆందోళనలో ఉండడంతో పెదప్రోలు, కొక్కిలిగడ్డ, మోపిదేవి గ్రామాల్లో ఇప్పటికే కూలీలు అమాంతం రేట్లను రెట్టింపు చేశారు. వరికుప్ప వేసేందుకు రూ.4 వేలు ఉండగా, రైతుల ఆందోళనను ఆసరాగా చేసుకుని రూ.6 వేల నుంచి రూ.7 వేలకు పెంచారు. వర్షానికి పంట తడవకుండా కాపాడుకోవాలనే ఉద్దేశంతో రైతులు ఆర్థికభారమైనప్పటికీ వరికుప్పలు వేస్తున్నారు.



వాతావరణంలో మార్పుల కారణంగా కొక్కిలిగడ్డ వద్ద హడావుడిగా కుప్పలు వేస్తున్న రైతులు

పవర్‌లిఫ్టింగ్ జాతీయ పోటీల్లో
హర్షిత్‌సాయికి ద్వితీయస్థానం



మచిలీపట్నం టౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఇండియన్ పవర్‌లిఫ్టింగ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ పోటీల్లో 66 కిలోల విభాగంలో మచిలీపట్నానికి చెందిన కె.హర్షిత్‌సాయి ద్వితీయ స్థానం సాధించాడు. హర్షిత్ సాయికి ఫెడరేషన్ సభ్యుడు కె.దత్ ప్రశంసాపత్రాలు, మెడల్స్ అందజేశారు.

15న ఐక్య క్రిస్మస్ వేడుకలు



ఐక్యక్రిస్మస్ కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న బ్రదర్ కిరణ్‌పాల్ తదితరులు

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఐక్య క్రిస్మస్ వేడుకలను ఈనెల 15న నిర్వహిస్తున్నామని, ఈ సందర్భంగా జిల్లా కోర్టు సెంటర్ నుంచి కోనేరుసెంటర్ వరకు ర్యాలీ నిర్వహిస్తామని విజయవంతం చేయాలని క్రైస్తవులకు ఏపీసీ ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు, బెరాకా మినిస్ట్రీస్ ఫౌండర్ బ్రదర్ కిరణ్‌పాల్ పిలుపునిచ్చారు. హైనీ చర్చిలో గురువారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వేడుకల్లో అంతర్జాతీయ ప్రసంగీకుడు డాక్టర్ జాన్‌వెస్లీ ప్రసంగిస్తారన్నారు.



యూటీఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి మోడల్ టెస్టు పేపర్లను ఆవిష్కరిస్తున్న డీఈవో పీవీజే రామారావు

పదో తరగతిలో నూరుశాతం ఉత్తీర్ణతకు కృషి చేయండి

- ఉపాధ్యాయులకు డీఈవో పీవీజే రామారావు సూచన

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లాలో పదో తరగతి విద్యార్థులు నూరుశాతం సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని డీఈవో పి.వి.జె.రామారావు సూచించారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థుల కోసం రూపొందించిన మోడల్ టెస్టు పేపర్లను గురువారం డీఈవో ఆవిష్కరించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులకు ఈ మోడల్ పేపర్లు ఎంతో ఉపయోగపడతాయన్నారు. యూటీఎఫ్ నాయకులు ఎండీ హుస్సేన్, శేషారావు, కె.ఉమామహేశ్వరరావు, కె.లెనిన్‌బాబు, జె.ప్రసాదరావు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

ఘంటసాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం విశేష కృషి చేస్తోందని టీడీపీ నాయకుడు పరుచూరి సుభాష్ చంద్రబోస్ పేర్కొన్నారు. గురువారం తాడేపల్లిలో లబ్ధిదారుడు పోతన వెంకటేశ్వరరావు రూ.1.15 లక్షలతో నూతనంగా నిర్మించిన గోకుల షెడ్డును ఆయన ప్రారంభించారు.

ఎంటీయూ 1318 రైతులకు అనుకూలం

ఘంటసాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎంటీయూ 1318 వరి రకం రైతులకు అనుకూలంగా ఉందని, కాండం దృఢంగా ఉండి, పంట చేను పడిపోదని, తక్కువ నత్రజని తీసుకుంటుందని కేవీకే సమన్వయకర్త డాక్టర్ డి.సుధారాణి తెలిపారు. మంచి దిగుబడి వస్తుందని పేర్కొన్నారు. దేవరకోటలో సాగు చేసిన ఎంటీయూ 1318 రకం వరి పంటను ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రానికి చెందిన శాస్త్రవేత్తలు గురువారం పరిశీలించారు. పంటను సాగు చేసిన రైతులతో మాట్లాడారు. 1318 రకం పంటపై వారి అభిప్రాయాలను సేకరించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.వెంకటలక్ష్మి, డాక్టర్ కె.రేవతి పాల్గొన్నారు.



దేవరకోటలో పంటను పరిశీలించి రైతులతో మాట్లాడుతున్న డాక్టర్ సుధారాణి

సాగునీటి సంఘాల ఎన్నికలు
సమర్థవంతంగా నిర్వహించాలి

మోపిదేవి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల 14వ తేదీన సాగునీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని తహసీల్దార్ ఎస్.శ్రీవిద్య సూచించారు. గురువారం మండల విద్యాశాఖ కార్యాలయంలోని సమావేశపు హాలులో ఎన్నికల అధికారులు, సహాయక అధికారులు, రెవెన్యూ, సచివాలయ ఉద్యోగులు, జలవనరుల శాఖ ఉద్యోగులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. 14వ తేదీ ఉదయం 8 గంటలకు ఎన్నికల ప్రక్రియ ప్రారంభమవుతుందని, 9 గంటలలోపు ఓటు హక్కు కలిగిన ప్రతీ రైతును హాలులోకి అనుమతించాలని సూచించారు. ప్రలోభాలకు తావివ్వకుండా నిబంధనల మేరకు ఎన్నికల ప్రక్రియ కొనసాగించాలని ఆదేశించారు. జలవనరుల శాఖ ఏఈలు రామ్‌కుమార్, రవితేజ, ఎంపీడీవో జె.స్వర్ణభారతి పాల్గొన్నారు.

మూడు సంఘాలకు ఎన్నికలు

అవనిగడ్డ రూరల్: మండలంలో మోదుమూడి, అశ్వారావుపాలెం, వేకనూరు సాగునీటి సంఘాల ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని వివిధ శాఖల అధికారులకు తహసీల్దార్ నాగమల్లేశ్వరరావు సూచించారు. తహసీల్దార్ కార్యాలయంలో అధికారులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఇప్పటికే ఓటర్ల జాబితాలు రూపొందించామన్నారు. డీటీ మండలి కేశవి, ఎంఈవో-2 అన్నపరెడ్డి పిచ్చయ్య పాల్గొన్నారు.

ఎన్నికలు నిర్వహించే పాఠశాలలు

ఘంటసాల, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): మండలంలోని నీటి వినియోగదారుల సంఘాలకు శనివారం ఎన్నికలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ బి.విజయప్రసాద్ తెలిపారు. 158-చిట్టూరు నీటి సంఘానికి చిట్టూరు హైస్కూల్, 159-లంకపల్లి నీటి సంఘానికి లంకపల్లి జడ్పీ హైస్కూల్, 187-శ్రీకాకుళం నీటి సంఘానికి శ్రీకాకుళం జడ్పీ హైస్కూల్, 188-ఘంటసాల నీటి సంఘానికి ఘంటసాల జడ్పీ హైస్కూల్, 189-పాపవినాశనం నీటి సంఘానికి పాపవినాశనం ప్రాథమిక పాఠశాల, 190-చిట్టూర్పు నీటి సంఘానికి చిట్టూర్పు ప్రాథమిక పాఠశాలలో ఎన్నికలు నిర్వహిస్తారని తెలిపారు. ఓటు హక్కు కలిగిన రైతులు ఉదయం 8 గంటల కల్లా తమ ఓటును వినియోగించుకోవటానికి పోలింగ్ కేంద్రానికి రావాలన్నారు. 9 గంటల వరకే అనుమతిస్తామని తెలిపారు.



ఉపాధ్యాయులు గురవయ్య, దాస్‌ను సన్మానిస్తున్న సీఐ కె.ఈశ్వరరావు, ఎస్‌ఐ పీఎస్వీ సుబ్రహ్మణ్యం

ఉపాధ్యాయులకు ఘన సన్మానం

చల్లపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ పార్కు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విశ్రాంత ఈవోఆర్డీ దాసి సీతారామరాజు అధ్యక్షతన ఇద్దరు ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల పదవీవిరమణ చేసిన అడపా గురవయ్య, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన కైతేపల్లి దాస్‌ను ఘనంగా సన్మానించారు. సీఐ కె.ఈశ్వరరావు, ఎస్‌ఐ పీఎస్వీ సుబ్రహ్మణ్యం ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఎంఎస్‌ఎంఈ క్లస్టర్‌కు
బ్యాంకింగ్ రంగాన్ని అనుసంధానిస్తాం

- సిడ్‌బీ మచిలీపట్నం శాఖ ప్రారంభోత్సవంలో సీజీఎం సందీప్ వర్మ



మాట్లాడుతున్న సిడ్‌బీ చీఫ్ జనరల్ మేనేజర్ సందీప్‌వర్మ

మచిలీపట్నం టౌన్, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ఎంఎస్‌ఎంఈ క్లస్టర్‌కు బ్యాంకింగ్ రంగాన్ని అనుసంధానం చేసే లక్ష్యంతో మచిలీపట్నంలో స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంకు ఆఫ్ ఇండియా(సిడ్‌బీ) శాఖను ప్రారంభించినట్లు ఆ బ్యాంకు చీఫ్ జనరల్ మేనేజర్ సందీప్‌వర్మ పేర్కొన్నారు. హైనీ చర్చికు దగ్గరలో ఏర్పాటు చేసిన సిడ్‌బీ శాఖను గురువారం చీఫ్ జనరల్ మేనేజర్ సందీప్‌వర్మ ప్రారంభించారు. చిన్న పరిశ్రమలను స్థాపించుకునే వారికి ఎంఎస్‌ఎంఈ ద్వారా తమ బ్యాంకు సబ్సిడీతో కూడిన రుణాలు అందజేస్తుందన్నారు. జనరల్ మేనేజర్ వేమూరి చంద్రమౌళి, మచిలీపట్నం ఇమిటేషన్ జ్యూయలరీ అసోసియేషన్ అధ్యక్షుడు పెద్దేటి వెంకట సుబ్బారావు, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ రాపాటి వెంకట్రావు, జ్యూయలరీ పార్కు కార్యదర్శి అంకెం జితేంద్ర, కోశాధికారి నరహరిశెట్టి వెంకటసుబ్బారావు, ఉపాధ్యక్షుడు బసవ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ మహమ్మద్ రమ్మతుల్లా బేగ్ పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోండి

కోడూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలని రైతులకు తహసీల్దార్ శ్రీనునాయక్ సూచించారు. సాలెంపాలెంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. పట్టాదారు పాసుపుస్తకాల కోసం 51, సర్వే కోసం 27, 22ఏ డిలేషన్ కోసం 3 మొత్తం 81 అర్జీలు వచ్చాయని తెలిపారు.

తలగడదీవిలో 65 అర్జీలు

నాగాయలంక: తలగడదీవిలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 65 అర్జీలు వచ్చాయని, వాటిని పరిష్కరిస్తామని తహసీల్దార్ ఎం.హరినాథ్ తెలిపారు. శనివారం సాగునీటి సంఘాలు ఎన్నికలు నిర్వహిస్తుండగా, మండల పరిధిలో 108 ప్రాదేశిక నియోజకవర్గాలు, 9 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతాయని ఆయకట్టు రైతులు పాల్గొనాలని ఆయన సూచించారు.

నెలకుర్రులో..

మచిలీపట్నం టౌన్: నెలకుర్రులో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో భూముల సమస్యలపై రైతులు అర్జీలు సమర్పించారు. అడంగల్‌లో పేర్ల సవరణ, సరిహద్దుల్లో తేడాలు, పట్టాదారు పాసుపుస్తకాల్లో తేడాలపై తహసీల్దార్ మధుసూదనరావుకు అర్జీలు సమర్పించారు. డీటీ కల్పన పాల్గొన్నారు.

పట్టాదారు పాస్ పుస్తకాలు ఇప్పించండి

పెడన రూరల్: వ్యవసాయ భూములు కొనుగోలు చేసినప్పటికీ పట్టాదారు పాస్‌పుస్తకాలు అందడంలేదని రైతులు రెవెన్యూ సదస్సుల్లో ఫిర్యాదు చేశారు. పెనుమల్లి, నేలకొండపల్లి, శేరీవర్తర్లపల్లి, దిరిశవల్లి గ్రామాల్లో మండల ప్రత్యేకాధికారి పద్మావతి, ఇన్‌చార్జ్ తహసీల్దార్ కె.అనిల్‌కుమార్, ఇన్‌చార్జ్ ఎండీవో జయరామ రెవెన్యూ గ్రామసభలు నిర్వహించారు. పాస్‌పుస్తకాలు అందలేదని, అడంగల్‌లో తప్పులను సరిచేయాలని రైతులు అర్జీలు ఇచ్చారు. ఆర్‌ఐ విజయలక్ష్మి, సర్వేయర్ దాస్, జడ్పీటీసీసభ్యుడు అర్జా నగేష్, గరికపాటి రామానాయుడు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణం వేగవంతం చేయండి



పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

అవనిగడ్డ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పల్లె పండుగ కార్యక్రమం ద్వారా నియోజకవర్గంలో చేపట్టిన సీసీ రహదారుల నిర్మాణం వేగవంతం చేయాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ సూచించారు. గురువారం తన కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. పీఆర్ డీఈఈ పి.సురేష్‌బాబు సీసీ రోడ్ల నిర్మాణం వివరాలను ఎమ్మెల్యేకు వివరించారు. నియోజకవర్గంలో 43.95 కిలోమీటర్ల మేర 447 సీసీ రోడ్లకు రూ.27.15 కోట్లు మంజూరు కాగా, 191 రోడ్ల నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. మరో 16 రోడ్లు నిర్మాణ దశలో ఉన్నాయని తెలిపారు. అవనిగడ్డ మండలంలో 109 రోడ్లు మంజూరు కాగా, 103 గ్రౌండింగ్ చేసి 59 నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. నాలుగు సీసీ రోడ్లు నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. చల్లపల్లి మండలంలో 80 సీసీ రోడ్లు మంజూరు కాగా, 75 గ్రౌండింగ్ చేసి 18 నిర్మాణం పూర్తి చేశామని తెలిపారు. ఒకటి నిర్మాణదశలో ఉందన్నారు. ఘంటసాల మండలంలో 46కు 46 గ్రౌండింగ్ చేసి 24 నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. రెండు రోడ్లు నిర్మాణ దశలో ఉన్నట్లు తెలిపారు. కోడూరు మండలంలో 61 రోడ్లకు 60 గ్రౌండింగ్ చేసి 28 నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. మరో రెండు నిర్మాణదశలో ఉన్నట్లు తెలిపారు. మోపిదేవి మండలంలో 82కు 76 గ్రౌండింగ్ చేసి 49 నిర్మాణం పూర్తి చేసినట్లు వివరించారు. ఒకటి నిర్మాణ దశలో ఉందన్నారు. బొబ్బర్లంకలో నూరుశాతం సీసీ రోడ్ల నిర్మాణం పూర్తిచేసినట్లు తెలిపారు. నాగాయలంక మండలంలో 69 సీసీ రోడ్లు మంజూరు కాగా, 67 గ్రౌండింగ్ చేసి 13 నిర్మాణం పూర్తి చేసినట్లు తెలిపారు. మరో నాలుగు నిర్మాణ దశలో ఉన్నట్లు తెలిపారు. ఏఈఈలు బొప్పన శ్రీనివాసు, సీహెచ్ బ్రహ్మానందబాబు, పి.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

పెడన 14వ వార్డు కౌన్సిలర్ కన్నుమూత



అనుముల నాగమల్లేశ్వరమ్మ(ఫైల్)

పెడన, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): 14వ వార్డు కౌన్సిలర్ అనుముల నాగమల్లేశ్వరమ్మ(54) గురువారం మృతి చెందారు. కొంతకాలంగా ఆమె అనారోగ్యంతో బాధపడుతున్నారు. గత మునిసిపల్ ఎన్నికల్లో టీడీపీ తరపున 22 మంది పోటీ చేస్తే నాగమల్లేశ్వరమ్మ ఒక్కరే కౌన్సిలర్‌గా గెలుపొందారు. ఆమె భర్త పూర్ణచంద్రరావు పట్టణంలో ప్రముఖ టీడీపీ నాయకుడు. నాగమల్లేశ్వరమ్మ మృతితో 14వ వార్డులో విషాదఛాయలు అలముకున్నాయి. నాగమల్లేశ్వరమ్మ మృతి పట్ల బీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు, పార్టీ పట్టణ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, మునిసిపల్ కమిషనర్ ఎం.గోపాలరావు తదితరులు ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

పంచాయతీల అభివృద్ధికి కృషి చేయండి

మోపిదేవి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీల్లో సుస్థిరమైన అభివృద్ధి సాధించేందుకు ప్రణాళికలు రూపొందించి కృషి చేయాలని ఉద్యోగులకు ఎంపీడీవో జె.స్వర్ణభారతి తెలిపారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో గ్రామపంచాయతీ సుస్థిర అభివృద్ధి - స్థానికీకరణ అంశంపై మండల స్థాయి అధికారులు, సచివాలయ ఉద్యోగులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లా లింక్ ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, ఈవోపీఆర్డీ కేటీ సుందరి, పంచాయతీ కార్యదర్శి రామకోటేశ్వరరావు పాల్గొన్నారు.

కోడూరు మండల కార్యాలయంలో..

కోడూరు: సుస్థిరాభివృద్ధి లక్ష్యాల స్థానికీకరణపై మండల స్థాయి శిక్షణ తరగతులు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు. జిల్లా లింక్‌ఆఫీసర్ కె.శ్రీనివాసరావు, ఎంపీడీవో సుధాప్రవీణ్ పాల్గొన్నారు.









ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రకటనల (అడ్వర్టైజ్‌మెంట్) కోసం సంప్రదించాల్సిన నెంబర్లు
✆ 99854 11610, 99854 11331

ఆంధ్రజ్యోతి దినపత్రిక కావాల్సిన వారు ఈ కింది నెంబర్లను సంప్రదించగలరు
✆ సర్క్యులేషన్ మేనేజర్ 9985411604,
డీజీఎం : 9885821929, బీఎం : 99854 11234